

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శుక్రవారం 15 అక్టోబరు 2021 సంపుటి : 03 సంచిక : 64 పేజీలు : 4 వెల : రూ 3-00

# లక్ష్యంలోగా సర్వేను పూర్తి చేయాలి: సీఎం జగన్



### శాశ్వత భూహక్కు- భూరక్ష పథకంపై సీఎం సమీక్ష



విజయవాడ, అక్టోబరు 14, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు- భూరక్ష పథకంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఈ సమీక్షా సమావేశంలో అధికారులకు సీఎం జగన్ పలు కీలక సూచనలు చేశారు. నిర్దేశించుకున్న లక్ష్యంలోగా సర్వేను పూర్తిచేయాలి సీఎం జగన్ అధికారులకు ఆదేశించారు. భూ క్రయ విక్రయాలు జరిగినప్పుడే రికార్డులు కూడా అప్‌డేట్ చేయాలంటూ సూచించారు. గ్రామ సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్‌కు సంబంధించిన ప్రక్రియలు చేపట్టాలని సీఎం పేర్కొన్నారు. సర్వే డేటా భద్రతకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సీఎం దిశా నిర్దేశంచేశారు. ప్రతి ఏటా ఒక వారంలో ల్యాండ్ రికార్డుల అప్‌డేషన్ కార్యక్రమం చేపట్టాలని సూచించారు. నిషేధిత భూముల వ్యవహారాలకు (22 ఎ) చెక్‌పెట్టాల్సిందేనని సీఎం పేర్కొన్నారు. ఆ జాబితాలో పెట్టాలన్నా, తొలగించాలన్నా సరైన విధానాలు పాటించాలని అధికారులకు సూచించారు. లోపాలు లేకుండా ఆధీకృత వ్యవస్థలను బలోపేతం చేయాలన్నారు.కాగా.. శాశ్వత భూహక్కు- భూరక్ష పథకం సమీక్షలో భాగంగా అధికారులు సమగ్ర భూ సర్వే పనుల్లో ప్రగతిని, లక్ష్యాలను సీఎంకు వివరించారు. పైలట్ ప్రాజెక్టు కింద చేపట్టిన 51 గ్రామాల్లో సర్వే పూర్తి చేసినట్లు వివరించారు. డిసెంబర్ 2021 నాటికి మరో 650 గ్రామాల్లో పూర్తవుతుందని పేర్కొన్నారు. మండలానికి ఒక గ్రామం చొప్పున ఈ 650 గ్రామాల్లో సర్వే పూర్తి చేస్తామని అధికారులు సీఎం జగన్‌కు తెలియజేశారు. జూన్ 22, 2022 నాటికి 2400 గ్రామాల్లో సర్వే పూర్తిచేస్తామని అధికారులు తెలిపారు. మరో 2400 గ్రామాల్లో ఆగస్టు 2022 నాటికి పూర్తి అవుతుందని పేర్కొన్నారు. పైలెట్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే 51 గ్రామాల్లో 30,679 కమతాలను సర్వే చేశామని అధికారులు పేర్కొన్నారు. సర్వే పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు, మ్యాపులతో కూడిన పట్టాదారు పుస్తకాన్ని రైతులకు అందిస్తున్నామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు.ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. భూముల క్రయ విక్రయాలు జరిగినప్పుడు పట్టాదారు పుస్తకానికి సంబంధించి అమ్మిన వ్యక్తి రికార్డుల్లోనూ, కొనుగోలు చేసిన వ్యక్తి రికార్డుల్లోనూ అప్‌డేట్ కావాలని సూచించారు. అప్పుడే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయినట్టుగా భావించాలన్నారు. దీనిపై ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి తగిన విధానాలను రూపొందించాలని సీఎం సూచించారు. ల్యాండు రికార్డుల్లో నిపుణులైన వారిని, న్యాయపరమైన అంశాల్లో అనుభవం ఉన్నవారిని ఈ టీంలో ఉంచాలని సూచించారు. వీరు ఇచ్చిన సిఫారసుల ఆధారంగా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ ప్రక్రియలకు సంబంధించి ఎస్‌ఓపీలు రూపొందించాలని సూచించారు. గ్రామ సచివాలయాల్లోనే ఈప్రక్రియ పూర్తయ్యేలా ఉండాలంటూ సీఎం ఆదేశాలిచ్చారు. ప్రజలు వీటికోసం ఆఫీసులు చుట్టూ తిరగాల్సిన పనిలేకుండా తగిన ఎస్‌ఓపీ రూపొందించాలని సీఎం ఆదేశాలిచ్చారుల్యాండ్ సర్వేను పూర్తిచేయడానికి తగినంత సాంకేతిక పరికరాలను సమకూర్చుకోవాలని సీఎం ఆదేశించారు. దీనికోసం తగినన్ని డ్రోన్లు కూడా సమకూర్చుకోవాలని సూచించారు. ల్యాండ్ రికార్డుల అప్‌డేషన్‌ను ప్రతి ఏటా ఒక వారంలో చేపట్టాలని, దీనిపై తగిన కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. ల్యాండ్ రికార్డుల అప్‌డేషన్, రిజిస్ట్రేషన్ తదితర ప్రక్రియలన్నీ అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. మనం తీసుకొస్తున్న సంస్కరణల కారణంగా ఎక్కడా అవినీతికి చోటు ఉండకూడదని.. రైతులకు, భూ యజమానులకు మేలు చేసేలా ఉండాలని సీఎం సూచించారు. దీనికోసం సమర్థవంతమైన మార్గదర్శకాలను తయారు చేయాలని సీఎం సూచించారు.ప్రభుత్వ హయాంలో నిషేధిత భూముల అంశానికి సంబంధించి రికార్డుల్లో చోటుచేసుకున్న వ్యవహారాలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సీఎం జగన్ అధికారులకు సూచించారు. 22ఎ కి సంబంధించి అనేక వ్యవహారాలు బయటకు వస్తున్న నేపథ్యంలో ఇలాంటి వాటికి చెక్ పెట్టాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టంచేశారు. అధికారులు దీనిపై ఒక ప్రత్యేక విధానాన్ని తీసుకురావాలని సీఎం సూచించారు.




## కేంద్రం భరోసా.. 18 ఏళ్లలోపు బాలలకు రూ.10 లక్షలు డిపాజిట్

### కోవిడ్‌తో అనాథలైన బాలలకు కేంద్రం భరోసా
### రాష్ట్రంలో అనాథ బాలలకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ సాయం
### పీఎం కేర్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి మరో సాయం
### ఇప్పటివరకు 237 మంది అర్హుల గుర్తింపు



అమరావతి: కరోనా మహమ్మారి కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన బాలలకు మరో భరోసా దక్కనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అనాథ బాలలను ఆదుకుంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం పీఎం కేర్ స్కీం ద్వారా ఆదుకునేందుకు మార్గదర్శకాలను విడుదల చేసింది. కోవిడ్ కారణంగా అనాథలుగా మారిన పిల్లల సమగ్ర సంరక్షణ, విద్య, ఉపాధి, వసతి వంటి వాటిని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే చేపట్టగా కేంద్ర ప్రభుత్వం మరో రూ.10 లక్షలు డిపాజిట్ చేసి సంరక్షణ చర్యలు తీసుకోనుంది. పీఎం కేర్ స్కీమ్ పథకానికి కలెక్టర్ల ద్వారా నిర్వహించిన ఎంపికలో 237 మంది అర్హులని గుర్తించారు.గతేడాది మార్చి 11 నుంచి కూడా తల్లిదండ్రులు, సంరక్షకులను కోల్పోయిన 18 ఏళ్లలోపు బాలలు ఈ పథకానికి అర్హులు. ఈ ఏడాది మే 29 నుంచి లబ్ధిదారుల నమోదు ప్రక్రియ జరుగుతోంది. డిసెంబర్ 31 వరకు లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు. అర్హులకు రూ.10 లక్షల వంతున పోస్టాఫీసులో డిపాజిట్ చేసి, వారికి 18 సంవత్సరాలు దాటిన తరువాత 23 ఏళ్ల వరకు ఆ డిపాజిట్‌పై ప్రతినెల స్టైఫండ్ ఇస్తారు. 23 ఏళ్లు నిండిన తర్వాత డిపాజిట్ మొత్తాన్ని వారికి అప్పగిస్తారు. అనాథ బాలల సమగ్ర సంరక్షణతోపాటు విద్య, ఆరోగ్యం, ఉపాధికి ప్రాధాన్యం ఇస్తారు. వారికి ఆరోగ్య బీమాతోపాటు ప్రమాద బీమా రూ.5 లక్షలు వర్తించేలా చేస్తారుకరోనా కారణంగా తల్లిదండ్రులను కోల్పోయిన బాలలకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.10 లక్షలు చొప్పున బ్యాంకుల్లో డిపాజిట్ చేసింది. వారికి పిల్లల సంరక్షణ కేంద్రాల్లో (ఛైల్డ్ కేర్ సెంటర్‌లలో) వసతి, విద్య, వైద్యం వంటి ఏర్పాట్లు చేశాం. రాష్ట్ర ప్రభుత్వం చేసిన రూ.10 లక్షల డిపాజిట్ వారికి 18 ఏళ్లు నిండగానే తీసుకునే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే మరో రూ.10 లక్షల డిపాజిట్ 23 ఏళ్ల వయసు నిండాకే తీసుకునేలా మార్గదర్శకాలు ఇచ్చారు. అనాథ బాలలకు అవసరమైన తోడ్పాటు అందించేలా సంబంధిత ప్రభుత్వ శాఖలను సమన్వయం చేస్తాం.

## ఘోర అగ్నిప్రమాదం, 46 మంది సజీవ దహనం



తైవాన్ : తైవాన్‌లో జరిగిన ఘోర అగ్ని ప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. గురువారం తెల్లవారుజామున సంభవించిన ఈ ప్రమాదంలో 46 మంది సజీవం దహనమైనారు. మరో 79 మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో 14 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో మృతుల సంఖ్య ఇంకాపెరిగే అవకాశముందనే ఆందోళన వ్యక్తమవుతోంది.దక్షిణ తైవాన్‌లో కౌహ్సియుంగ్ నగరంలోని 13 అంతస్తుల టవర్ బ్లాక్‌లో ఉదయం 3 గంటలకు మంటలు చెలరేగాయని స్థానిక అగ్నిమాపక శాఖ తెలిపింది. బారీగా ఎగిసిన అగ్నికీలల్లో 46 మంది చిక్కుకొని అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. మంటలను అదుపులోకి తీసుచ్చిన రక్షణ, సహాయ దళాలు, బాధితుల కోసం గాలిస్తున్నారు. అగ్నిప్రమాదానికి ముందు పేలుడు శబ్దం వచ్చినట్లు పెద్ద శబ్దం వినిపించిందని సమీప నివాసితులు స్థానిక మీడియాకు తెలిపారు. భవన శిథిలాల్లో చిక్కుక్కున్న వారిని రక్షించేందుకు ఫైర్ సిబ్బంది నాలుగు గంటలకు పైగా తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందనీ, భవనంలోనిని కింది అంతస్తుల్లో మంటలు చెలరేగినట్లు ఫైర్ సిబ్బంది వెల్లడించింది. ఈ ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సిఉంది.

## 'కాంగ్రెస్ చేసిన పాపం దేశంలోనే కనుమరుగయ్యేలా చేసింది'



వైఎస్సార్ జిల్లా: బీజేపీ, కాంగ్రెస్‌లు రాష్ట్రానికి తీరని ద్రోహం చేశాయని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. బద్వేలు ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా గురువారం మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ అవినాష్ రెడ్డి.. వైఎస్సార్ సీపీ అభ్యర్థి దాసరి సుధతో కలిసి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ చేసిన పాపం వారిని రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే కనుమరుగయ్యేలా చేశాయి. బీజేపీ గురించి ఇక ఎవరికి తెలియదు. ఆ పార్టీకి ఎవరూ ఓటు కూడా వెయ్యరు.ప్రభుత్వం చేపట్టిన సచివాలయ వ్యవస్థ, వలంటీర్ వ్యవస్థ ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేశాము. బద్వేలు నియోజకవర్గ పరిధిలో సాగు, తాగు నీరు కోసం చేస్తున్న కార్యక్రమాలు గత ప్రభుత్వాలు చేయలేదు. కేవలం అర్హతే కొలబద్ధగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం ఫలాలను అందిస్తున్నాం. కరోనా పరిస్థితులు ఎదుర్కొంటూ సంక్షేమం కుంటుపడకుండా పాలన అందిస్తున్న సీఎం జగన్' అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి అన్నారు. ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ.. 'ప్రభుత్వం చేపట్టిన సంక్షేమం, అభివృద్ధిని ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలి. ఉపఎన్నికలో ఎవ్వరూ ఊహించని భారీ ఆధిక్యత సాధించాలి. ప్రతి ఓటరు దగ్గరికీ వెళ్లి ప్రభుత్వ పాలన గురించి వివరించి ఓట్లు అడగండి' అని ఎంపీ అవినాష్ రెడ్డి అన్నారు.

## 'కట్టుకథలు.. చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య'

### మంత్రి కురసాల కన్నబాబు

విశాఖపట్నం: కరోనా సంక్షోభంలోనూ సంక్షేమ పథకాలు ఆగలేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కురసాల కన్నబాబు అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఇచ్చిన మాటను కచ్చితంగా నెరవేర్చే తత్వం సీఎం జగన్‌దన్నారు. సంక్షేమ పథకాలు చూసి ఓర్వలేక టీడీపీ తప్పుడు విమర్శలు చేస్తోందని మంత్రి మండిపడ్డారు.



"రాష్ట్రాన్ని అప్పులపాలు చేసింది చంద్రబాబే. నాడు-నేడు ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చాం. లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తున్నాం. కట్టుకథలు చెప్పడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. రైతులను మోసం చేసింది చంద్రబాబే. ఇంగ్లీష్ మీడియం అమలు చేస్తామంటే కేసులు వేసి అడ్డుపడతారు.దేశం మొత్తం కరెంటు కష్టాలు ఉన్నాయి. ఆ విషయాన్ని కేంద్ర ప్రభుత్వమే చెబుతోంది. రైతులకు బేడీలు వేసి జైలుకు పంపిన చరిత్ర చంద్రబాబుదని" మంత్రి కన్నబాబు ధ్వజమెత్తారు.

## మరిన్ని సర్జికల్ స్ట్రైక్స్ తప్పవు.. పాకిస్థాన్‌కు అమిత్ షా వార్నింగ్



న్యూఢిల్లీ: పాకిస్థాన్‌కు కేంద్ర హోంమంత్రి అమిత్ షా గట్టి వార్నింగ్ ఇచ్చారు. అతిక్రమణకు పాల్పడితే మరిన్ని సర్జికల్ స్ట్రైక్స్ తప్పవన్నారు. దాడులను ఏమాత్రం సహించబోమని సర్జికల్ స్ట్రైక్స్ నిరూపించాయి. మీరు ఇలాగే అతిక్రమణకు పాల్పడితే మరిన్ని స్ట్రైక్స్ తప్పవు అని అమిత్ షా హెచ్చరించారు. ప్రధాని నరేంద్ర మోదీ, మాజీ రక్షణ మంత్రి మనోహర్ పారికర్ తీసుకున్న ముఖ్యమైన నిర్ణయం ఈ సర్జికల్ స్ట్రైక్. ఇండియా సరిహద్దులను ఎవరూ చెరిపే ప్రయత్నం చేయకూడదన్న గట్టి సందేశం దీని ద్వారా వెళ్లింది. ఒకప్పుడు చర్చలు జరిగేవి. కానీ ఇప్పుడు దెబ్బకు దెబ్బ కొట్టే సమయం అని అమిత్ షా అన్నారు. గోవాలో నేషనల్ ఫోరెన్సిక్ సైన్సెస్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేయడానికి వెళ్లిన అమిత్ షా ఈ కీలకమైన వ్యాఖ్యలు చేశారు.

## ఏపీలో కొత్తగా 540 కరోనా కేసులు

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా 540 కరోనా కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య శాఖ వెల్లడించింది. గడిచిన 24 గంటల్లో 540 కరోనా కేసులతోపాటు 10 కరోనా మరణాలు కూడా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.అలాగే కొత్తగా కరోనా నుంచి 557 మంది కోలుకున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 6,588 యాక్టివ్ కరోనా కేసులు ఉన్నట్లు ఆరోగ్య శాఖ తెలిపింది. గడిచిన 24 గంటల్లో మొత్తం 40,350 మందికి కరోనా పరీక్షలు నిర్వహించినట్లు ఆరోగ్యశాఖ అధికారులు పేర్కొన్నారు.

## కార్పొరేటర్‌గా గెలవలేని లోకేష్.. సీఎంపై విమర్శలా: మంత్రి వెల్లంపల్లి

కర్నూలు: ఏపీ మాజీ మంత్రి నారా లోకేష్‌పై వైసీపీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు విమర్శలు గుప్పించారు. కార్పొరేటర్‌గా గెలవలేని లోకేష్.. సీఎం మీద ట్వీట్ చేయడం చాలా అసహ్యంగా ఉందని వెల్లంపల్లి అన్నారు. లోకేష్‌కు జగన్ గురించి మాట్లాడే నైతిక హక్కు, విలువలు గానీ లేవని మంత్రి వెల్లంపల్లి స్పష్టం చేశారు.



మతాలు, దేవాలయాలను అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడం లోకేష్‌కు తగదని మంత్రి వెల్లంపల్లి అన్నారు. శ్రీశైలం క్షేత్రాన్ని అభివృద్ధి చేసేందుకు మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశామని మంత్రి వెల్లంపల్లి అన్నారు. దేవాలయాల భూములను దోచుకునే వాళ్లపై కఠినమైన చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. దేవాలయాల అభివృద్ధి, ఆస్తులను కాపాడేందుకు ముందుకు వెళ్లామని మంత్రి వెల్లంపల్లి చెప్పారు.

## ప్రభుత్వ లెక్కల్లో కనిపించని లక్షా31వేల కోట్లు: దేవినేని ఉమ

అమరావతి: ప్రభుత్వ లెక్కల్లో రూ. లక్షా 31 వేల కోట్లు కనిపించడంలేదని టీడీపీ నేత, మాజీ మంత్రి దేవినేని ఉమ మహేశ్వరరావు ట్విట్టర్ వేదికగా ఆరోపించారు. జగన్ ప్రభుత్వం



అడ్డగోలుగా నిధుల మళ్లింపుతో లెక్కల్లో గోల్మాల్ చేస్తోందని తీవ్రస్థాయిలో విమర్శించారు. ఎక్కడ, ఏ విధంగా ఖర్చు చేసిందో ఎవరికీ తెలియదన్నారు. మాయమైన సొమ్ములు ఎవరి జేబుల్లోకి వెళ్ళాయని ప్రశ్నించారు. ఆదాయం, అప్పులు, ఖర్చుల లెక్కలపై శ్వేత పత్రం విడుదల చేసే ధైర్యం సీఎం జగన్‌కు ఉందా? అని దేవినేని ఉమ ప్రశ్నించారు.

## సంపాదకీయం

శుక్రవారం 15 అక్టోబరు 2021

# రష్యాలో మళ్లీ కరోనా... కలకలం

కరోనా వైరస్ రష్యాలో మళ్ళీ భీభత్సం సృష్టిస్తోంది.. అక్కడ మరణాలు గత రికార్డులను తిరగరాస్తున్నాయి. మంగళవారం ఒక్కరోజే ఏకంగా 973మంది మృతి చెందినట్టుగా అధికారులు వెల్లడించారు. రష్యాలో కరోనా మొదలైనప్పటి నుంచి ఇదే తొలిసారి కావడం గమనార్హం. ఇక గడిచిన 24గంటల్లో అక్కడ 28,190 కొత్త కేసులు నమోదయ్యాయి. తాజా కేసులతో కలిపి ఇప్పటివరకు మొత్తంగా 7.8 మిలియన్లకు పైగా కేసులు నమోదు అయ్యాయి. 2,18,345 మంది కరోనాతో ఇప్పటివరకు మృతి చెందారు. యూరప్‌లో అత్యధిక కొవిడ్ మరణాలు రష్యాలోనే సంభవించడం గమనార్హం. అయితే ఇన్ని మరణాలు అక్కడ సంభవించడానికి గల కారణం అక్కడ టీకా పంపిణీ మందకొడిగా సాగడమేనని అధికారులు అంచనా వేస్తున్నారు. దాదాపు 14.6కోట్ల జనాభా ఉన్న ఆ దేశంలో ఇప్పటివరకు 33శాతం మంది ఫస్ట్ డోస్, 29శాతం సెకండ్ డోస్ వేసుకున్నారువాతావరణంలో చోటు చేసుకుంటున్న మార్పులు, గ్లోబల్ వార్మింగ్ కారణంగా బుబోనిక్ ప్లేగు తిరిగి మళ్ళీ విజృంభించే అవకాశం ఉందని రష్యా లోని ప్రముఖ డాక్టర్ చెప్పారు. బ్లాక్ డెత్ వల్ల కలిగే ముప్పును గుర్తించి ముందుగా జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన హెచ్చరించారు. రోజు రోజుకీ పెరిగిపోతున్న గ్లోబల్ వార్మింగ్ ప్రజారోగ్యానికి 'ప్రమాదంగా మారిందని అన్నారు. ..డాక్టర్ అన్నా పోపోవా మాట్లాడుతూ, "గ్లోబల్ వార్మింగ్ , వాతావరణ మార్పులు పర్యావరణంతో పాటు మానవులపై కూడా ప్రభావం చూపిస్తుందని తెలిపారు. రోజు రోజుకీ ప్లేగు వ్యాధి బాధితుల సంఖ్య పెరుగుతుందని తమ అధ్యయనాల్లో వెలుగులోకి వచ్చిందని సంచలన కామెంట్స్ చేశారు. ఈ వ్యాధి మరింతగా వ్యాప్తి చెందకుండా ఉండడం కోసం వెంటనే ఈగల వ్యాప్తిని నివారించడం అత్యవసరమని డాక్టర్ అన్నా చెప్పారు. బ్లాక్ డెత్ అని కూడా పిలువబడే ప్లేగు ఇప్పటి వరకూ 200 మిలియన్ల మంది ప్రాణాలను బలితీసుకుంది. 14 వ శతాబ్దంలో ఈ వ్యాధి బారిన పడడంతో యూరప్ జనాభాలో 60% తుడిచిపెట్టుకుపోయింది. ఇక రష్యా, యుఎస్, చైనా ఇటీవలి మళ్ళీ ఈ వ్యాధి మూలాలు కనిపించాయి. దీంతో ఈ ప్లేగు వ్యాప్తిని నియంత్రించడానికి, వాతావరణ సంక్షోభంపై కఠిన చర్యలు తీసుకోవాలని యునిసెఫ్ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చింది. కాంగో, మడగాస్కర్ ,పెరూ దేశాల్లో బుబోనిక్ ప్లేగు కేసులు దాదాపు ప్రతి సంవత్సరం, సెప్టెంబర్ నుంచి ఏప్రిల్ మధ్య నమోదవుతాయి. బుబోనిక్ ప్లేగు అనేది బ్యాక్టీరియా నుంచి సంక్రమించే వ్యాధి. ఇది అడవి ఎలుకలపై వాలిన ఈగల నుంచి వ్యాపిస్తుంది. ఈ ప్లేగు సోకినట్లు సకాలంలో గుర్తించి చికిత్స తీసుకోకపోతే కేవలం 24 గంటలోనే వ్యాధి సోకిన బాధితులు మరణించే అవకాశం ఉంది. అయితే ఈ బుబోనిక్ ప్లేగు ఒకరి నుంచి మరొకరికి సోకడం అనేది చాలా అరుదు. జంతువుల నుంచి ముఖ్యంగా ఈగల నుంచి మాత్రమే మానవునికి సోకుతుందని తెలుస్తోంది. ప్లేగుతో బాధపడుతున్న వ్యక్తులు తీవ్ర జ్వరంలో బాధపడతారు. చలి, తలనొప్పి, శరీరం నొప్పులు, నరాల బలహీనత, వాంతులు, వికారం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

# రెండు కుటుంబాలు వివాదం

కాకినాడ, అక్టోబరు 14, (న్యూస్ పల్స్)తూర్పుగోదావరి జిల్లాలోని మెట్ట ప్రాంతానికి చెందిన ప్రత్తిపాడు నియోజకవర్గంలో రాజకీయాలు హీటెక్కాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య వ్యక్తిగత విమర్శలు , రాజకీయ విమర్శలు రోజుకో రకంగా ముదురుతున్నాయని అంటున్నారు పరిశీలకులు. ఈ నియోజకవర్గంలో కీలకమైన రెండు కుటుంబాలు చక్రం తిప్పుతున్నాయి. అవే వరుపుల, పర్వత ఫ్యామిలీలు. పర్వత ఫ్యామిలీ నుంచి బాపనమ్మ, గుర్రాజు, సుబ్బారావు, చిట్టిబాబు నలుగురు ఎమ్మెల్యేలుగా గతంలో చక్రం తిప్పారు. ఈ కుటుంబం నుంచి ప్రస్తుతం పర్వత పూర్ణ చంద్రప్రసాద్ దూకుడుగా ఉన్నారు. ఆయన ప్రస్తుతం వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇక, ఇక్కడి నుంచే వరుపుల ఫ్యామిలీ కూడా రాజకీయాలు చేస్తోంది. వరుపుల సుబ్బారావు, జోగిరాజులు టీడీపీలో చక్రం తిప్పుతున్నారు. వరుపుల రాజా టీడీపీలో ఉన్నారు. గత ఏడాది ఎన్నికల్లో పర్వత పూర్ణ చంద్రప్రసాద్ వైసీపీ నుంచి పోటీ చేయగా, టీడీపీ నుంచి వరుపుల రాజా బరిలో దిగారు. అయితే, జగన్ సునామీ నేపథ్యంలో వరుపుల రాజా ఓడిపోయారు. పర్వత పూర్ణ చంద్ర విజయం సాధించారు. అప్పటితో రాజకీయాలు ఆగిపోలేదు. అసలు రాజకీయం అక్కడే మొదలైంది. ఎన్నికల తర్వాత వరుపుల రాజా వైసీపీలోకి వచ్చేందుకు ప్రయత్నించారు. అయితే.. పూర్ణచంద్ర అడ్డుకున్నారు. ఎట్టి పరిస్థితిలోనూ రాజాను చేర్చుకునేందుకు వీల్లేదని పూర్ణ భీష్మించారు. దీంతో చేసేది లేక రాజా టీడీపీలోనే ఉండిపోయారు. ఇక, ఆ తర్వాత ఇరువురి మధ్య మరింతగా రాజకీయం రాజుకుంది. గతంలో డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న వరుపుల రాజా నిధుల దుర్వినియోగం చేసినట్టు పూర్ణ ఆరోపించారు. అది కూడా అసెంబ్లీలోనే ఆరోపించడం, విచారణకు పట్టుబట్టడంతో జగన్ సర్కారు ఈ విషయంలో విచారణకు ఆదేశించింది. రంగంలోకి దిగిన అధికారులు డీసీసీబీలో రూ. 16 కోట్ల అక్రమాలు జరిగాయని తేల్చారు. దీంతో పోలీసులు రాజాను అరెస్టు చేసేందుకు రెడీ అయ్యారు. అయితే, ఆయన హైకోర్టుకు వెళ్లి తన అరెస్టుపై స్టే తెచ్చుకున్నారు. ఇక, తనను కేసుల్లో ఇరికించేందుకు పూర్ణ ప్రయత్నించారంటూ.. రాజా వ్యక్తిగత విమర్శలకు దిగారు. దీనికి పూర్ణ మరింత రెచ్చిపోయారు. దీంతో ఈ వివాదం కాస్తా.. రెండు కుటుంబాల వివాదంగా మారిపోయింది. అయితే, ఇద్దరూ కూడా ఒకే సామాజిక వర్గానికి చెందిన నాయకులు కావడంతో టీడీపీ తరపున రంగంలోకి దిగిన సీనియర్లు.. నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చేందుకు ప్రయత్నించారు. అయితే, ఎమ్మెల్యే పర్వత పూర్ణ మాత్రం సయోధ్యకు ససేమిరా అన్నారు. పైగా వైసీపీకి ద్రోహం చేశావంటూ జ్యోతులపై విరుచుకుపడ్డారు. దీంతో సయోధ్య ఆదిలోనే తెగిపోయింది. ఈ పరిణామాలతో నియోజకవర్గం నిత్యం రాజకీయ కక్షలతో అట్టుడుకుతోంది. ఏం జరుగుతుందోనన్న టెన్షన్ నెలకొంది. మొత్తానికి గతంలో ఎంతో ఘన కీర్తి ఉన్న ఈ రెండు కుటుంబాలు ఇలా వ్యక్తిగత దాడులకు, రాజకీయ వేధింపులకు దిగడాన్ని ఓ వర్గం ప్రజలు హర్షించడం లేదని అంటున్నారు పరిశీలకులు. చివరికి ఈ వివాదం ఎటు మలుపు తిరుగుతుందో ? చూడాలి. ఏదేమైనా రెండు పార్టీల అధిష్టానాలు జోక్యం చేసుకుంటే తప్ప సమస్య పరిష్కారం కాదని అంటున్నారు ప్రజలు. చూడాలి ఏం చేస్తారో.

# వెలగపూడి మీదనే కీలక బాధ్యత

విశాఖపట్టణం, అక్టోబరు 14, (న్యూస్ పల్స్)ఆయన ఎన్టీఆర్ భక్తుడు. ఆపై బాలయ్య వీరాభిమాని, ఇక చంద్రబాబుకు అత్యంత విధేయుడు. ఆయనే విశాఖ తూర్పు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు. ఆయన ఎమ్మెల్యే కాక ముందు నుంచి టీడీపీకి అచ్చమైన కార్యకర్తగా ఉండేవారు. పార్టీ గెలుపు కోసం ఎన్నో రకాలుగా పాటుపడేవారు. ఇక నియోజకవర్గాల విభజన తరువాత చాన్స్ రావడంతో విశాఖ తూర్పు నుంచి 2009లో తొలిసారి ఎమ్మెల్యే అయిపోయారు. నాడు లక్కీ ఎమ్మెల్యే అని అంతా అన్నా ఇప్పటికి మూడు విడతలుగా గెలవడం అంటే ఆషామాషీ కాదు, తూర్పులో మార్పు రాదా అని వైసీపీ డీలాపడుతోంది అంటే వెలగపూడి ఎంతలా స్ట్రాంగ్ పునాది వేశారో అర్థమవుతుంది. టీడీపీలో 23 మంది ఎమ్మెల్యేలు గెలిస్తే అందులో ఇప్పటికి నలుగురు జారుకున్నారు. ఇలా ఎంతమంది వెళ్లిపోతారో ఎవరికీ తెలియదు. అయితే చంద్రబాబు కచ్చితంగా గుండెల మీద చేయి వేసుకుని చెప్పుకునే వారిలో వెలగపూడి మొదటి స్థానంలో ఉంటారు. టీడీపీలో చివరాఖరుకు ఇద్దరు ముగ్గురు మిగిలినా కూడా వారిలో వెలగపూడి కచ్చితంగా ఉంటారని బాబు లెక్క వేసేసుకున్నారు. ఇక మూడు సార్లు గెలిచినా ఆయన రెండు సార్లు విపక్షంలోనే ఉన్నారు. గత అయిదేళ్ళలో పార్టీ పవర్ లో ఉన్నా కూడా వెలగపూడి వట్టి ఎమ్మెల్యేగానే మిగిలిపోయారు. మరి చంద్రబాబు ఆయనకు ఏ విధమైనా పదవీ ఇవ్వలేదు. మంత్రి ఆశలు ఉన్నా బాబు సొంత సామాజికవర్గం కావడం అతి పెద్ద మైనస్ గా ఉంది. ఇక సీనియర్ ఎమ్మెల్యేగా విశాఖ అర్బన్ జిల్లా టీడీపీ రాజకీయాల్లో తన సత్తా చాటాలని వెలగపూడి ప్రయత్నం చేస్తున్నా కూడా అది కుదరడంలేదు. గెలిచిన వెలగపూడి కంటే ఓడిన పల్లా శ్రీనివాసరావు చంద్రబాబుకు ఎక్కువ అయ్యారు. కారణం ఆయన బీసీ కావడం, యాదవ సామాజికవర్గం సిటీలో ఎక్కువగా ఉండడం. దాంతో విశాఖ పార్లమెంట్ ప్రెసిడెంట్ పదవిని తన దగ్గర బంధువు, సీనియర్ నేత అయిన పట్టాభికి ఇప్పించుకుందామని వెలగపూడి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. బాబుకు ఆయన మీద అభిమానం ఉంది. వెలగపూడికి పార్టీ మీద భక్తి ఉంది. అయినా కూడా పదవులు మాత్రం రావడంలేదు. ఇది ఆయనతో పాటు అనుచరులలో కూడా తీరని మనోవేదనగా ఉందిట. పార్టీ పదవికే ఇంత కసరత్తు చేసినా కూడా చంద్రబాబు ఉత్త చేతులు చూపించాక ఇక విశాఖ మేయర్ పీఠం తన బంధువుకు కట్టబెడతారా అన్న డౌట్ అయితే వెలగపూడిలో ఉందిట. 2007లో పట్టాభి కార్పొరేటర్ గా గెలిచి టీడీపీ ఫ్లోర్ లీడర్ గా పనిచేసారు. అప్పట్లో కాంగ్రెస్ కి మేయర్ పీఠం దక్కింది.

మళ్ళీ ఎన్నికలు జరగలేదు. వచ్చే ఏడాది కనుక జీవీఎంసీ ఎన్నికలు జరిగితే పార్టీని గెలిపించే కీలక బాధ్యత వెలగపూడి మీదనే ఉంది. ఎందుకంటే సిటీలో మిగిలిన టీడీపీ ఎమ్మెల్యేల సంగతి డౌట్. పైగా బలం ఎక్కువగా ఉన్నది తూర్పులోనే. ఇంతాచేసి పార్టీని విజయతీరాలకు చేర్చినా తమ కుటుంబానికి మేయర్ పీఠం బాబు కట్టబెడతారా అన్నది వెలగపూడికి అతి పెద్ద సందేహంగా ఉందిట. బీసీల పేరు చెప్పి మళ్ళీ ఎవరికో కిరీటం పెడితే కష్టమంతా వేస్ట్ అవుతుందని ఆవేదన చెందుతున్నారట. మొత్తానికి విశాఖలో టీడీపీకి కళకళలాడిస్తున్నా రాజకీయంగా మాత్రం వెలగపూడి వెలవెలపోతున్నారని అనుచరులు అంటున్నారు

# గండికోటకూ భారీగా నిధులు

కడప, అక్టోబరు 14, (న్యూస్ పల్స్)గండికోటను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని శ్రీకారం చుట్టింది. భారీగా నిధులు వెచ్చించి సొబగులు అద్దనుంది. అమెరికాలోని గ్రాండ్ క్యానియన్ తర్వాత సుందరమైన ప్రాంతంగా దీనికి ప్రాచుర్యం కల్పించాలని భావిస్తోంది. వైఎస్సార్ పర్యాటక యూనివర్సిటీ కూడా ఏర్పాటు చేయాలని సంకల్పించింది. హైదరాబాద్‌లోని వైఎస్సార్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హాస్పిటాలటీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ తరహాలో గండికోటలో కూడా రూపుదిద్దాలని యోచిస్తోంది. ఇందుకోసం సుమారు రూ.100 కోట్లు వ్యయమవుందని అంచనా. దీంతోపాటు రూ.7.50 కోట్లతో ప్రారంభించి అసంపూర్తిగా ఉన్న రోప్‌వే నిర్మాణాన్ని కూడా పూర్తి చేయనుంది. అత్యాధునిక వసతులతో రిసార్ట్ రూపుదిద్దుకోనుంది. ఇందుకోసం ప్రభుత్వం 13 ఎకరాల స్థలాన్ని కేటాయించింది. అత్యాధునిక సౌకర్యాలతో హోటల్ నిర్మాణంతోపాటు ప్రకృతి వైద్యశాల, స్విమ్మింగ్‌ఫూల్ తదితర అన్ని వసతులతో ఈ రిసార్ట్స్ ఏర్పాటు కానుంది. ఇప్పటికే సాహసకృత్యాల అకాడమీ (అడ్వంచర్స్)కి రూ.3 కోట్లతో అన్ని వసతులు సమకూర్చుతున్నారు. ఐదెకరాలలో తరగతులతోపాటు హాస్టల్ వసతి కల్పించనున్నారు. హిమాలయ పర్వతాలలో మాత్రమే ఇలాంటి అకాడమీ ఉంది. అది కూడా అక్కడ పర్వతారోహణపై శిక్షణ మాత్రమే ఇస్తారు. గండికోటలో వాయు, జల, పర్వతారోహణలపై శిక్షణ ఇవ్వనున్నారు. కోటలో ఆర్కియాలజీ విభాగం అనుమతులతో దాల్మియా కంపెనీ దెబ్బతిన్న చారిత్రక కట్టడాలను పునరుద్ధరించే పనులను చేపట్టింది. టాయిలెట్ల నిర్మాణంతోపాటు కోట పరిసరాల శుభ్రత పనులు చేపడుతున్నారు. ఇప్పటికే రూ. 2 కోట్లతో హరిత హోటల్ నిర్మాణం చేట్టారు. మరో 15 వసతి గృహాలు (టెంట్లు) నిర్మించి ఫ్రీకౌట్ కంపెనీకి లీజుకు ఇచ్చింది. రూ.50 లక్షల ఖర్చుతో బోటింగ్ సౌకర్యం కలి?పంచారు. పచ్చదనం కోసం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. కోట ముందు నుంచి టెంట్ల వరకు సిమెంటు రోడ్డు నిర్మించారు. రూ.30 లక్షలతో సోలార్ లైట్లను ఏర్పాటు చేశారు. పర్యాటకులకు పడిపోకుండా రూ.5 లక్షలతో కోట వారగా రెయిలింగ్ ఏర్పాటు చేశారు.

రూ. 20 కోట్లతో జమ్మలమడుగు క్రాస్ నుంచి గండికోట వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు. గండికోట పరిధిలో రెండు వేల ఎకరాల ప్రభుత్వ భూములున్నాయి. తగినంతగా నీరుంది. రోడ్డు వసతి ఉంది. 80 కిలోమీటర్ల దూరంలోనే ఎయిర్‌పోర్టు ఉంది. సమీపంలోని జమ్మలమడుగులో రైల్వేస్టేషన్ ఉంది. 35 కిలోమీటర్ల దూరంలో ప్రొద్దుటూరు పట్టణముంది. పెట్టుబడిదారులకు అనుకూలమైన ప్రాంతం. గండికోట పర్యాటకంగా అభివృద్ధి చెందితే చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. చదువుకున్న యువత సరైన ప్రతిపాదనలతో ముందుకు వస్తే గండికోటలో వివిధ రకాల అభివృద్ధి పనులలో అవకాశం కల్పించి ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది.

# చాప కింద నీరులా క్షయ

ఏలూరు, అక్టోబరు 14, (న్యూస్ పల్స్) పశ్చిమగోదావరి జిల్లాలో క్షయ వ్యాధి చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఆ వ్యాధి మరణాలకు దారి తీస్తోంది. మూడేళ్లుగా ఏటా 4,500 నుంచి ఐదు వేల కేసులు నమోదవుతున్నాయని అధికారులు చెబుతున్నారు. అయితే ప్రైవేటు వైద్యులు చెబుతున్న ప్రకారం ఈ కేసుల సంఖ్య ఏటా మరో మూడింతలు అంటే 20 వేలకు పైమాటేనని తెలుస్తోంది. అకస్మాత్తుగా బరువు తగ్గిపోవడం, రాత్రి వేళ స్వల్ప స్థాయిలో జ్వరం రావడం, బాగా చెమటలు పట్టడం, నెలల తరబడి దగ్గు ఉండటం వంటి లక్షణాలతో క్షయ బాధితులు కొన్ని సందర్భాల్లో మరణాలపాలవుతున్నారు. ఏజెన్సీ, మెట్ట, డెల్టా అనే భేదం లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ క్షయ పీడితులు పెరిగిపోతున్నారు. డెల్టా, మెట్ట ప్రాంతాల్లో క్షయ కేసులు అధికంగా నమోదవుతుండగా, ఏజెన్సీలో తక్కువగా ఉన్నాయి. ఈ రెండు ప్రాంతాల్లో మరణాల సంఖ్య మాత్రం అధికంగా ఉంటోంది. రోగ నిరోధక శక్తి బలహీనపడినప్పుడు క్షయ వ్యాధి దాడి చేస్తుంది. పొగ తాగేవారు, మద్యం అలవాటు ఉన్న వారు, మధుమేహం, హెచ్ఐవీ బాధితులు, గని కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, మురికి వాడల్లో నివసించే వారు, గాలి సరిగా ప్రసరించని ప్రాంతాల్లో జీవించే వారికి క్షయ వ్యాధి వచ్చే అవకాశాలు ఎక్కువ. సరైన పోషకాహారం , నిద్ర వంటివి లోపించడం వలన రోగ నిరోధక శక్తి సన్నగిల్లే వారికి ఈ ముప్పు పొంచి ఉందని వైద్యులు చెబుతున్నారు. సాధారణంగా క్షయ వ్యాధి ఊపిరితిత్తులకు సోకుతుంటుంది. ఇక్కడితోనే కాకుండా శరీరంలో గోళ్లు, వెంట్రుకలు మినహా ఏ భాగాన్నయినా క్షయ కబళిస్తుంది. జిల్లాలో ఏటా 4,500 నుంచి 5 వేల వరకు క్షయ వ్యాధి కేసులు నమోదవుతున్నాయని జిల్లా క్షయవ్యాధి నివారణాధికారిణి డా.జి రత్నకుమారి తెలిపారు. గత మూడేళ్లుగా ఇదే పరిస్థితి ఉంది. క్షయ పీడిత జిల్లాల్లో మన రాష్ట్రం 4వ స్థానంలో ఉన్నట్టు ప్రభుత్వం గుర్తించిందన్నారు. మురికివాడల్లోని పరిస్థితులే క్షయ వ్యాధికి ప్రధాన కారణం. ఇరుకు ఇళ్లల్లో, ఒకే గదిలో ఎక్కువ మది నివసించడం వంటి పరిస్థితులు కూడా ఉన్నాయి. ముఖ్యంగా భవన నిర్మాణ పనులు, శ్లాబ్‌లు, సిమెంట్ పనులు చేసే వారికి మార్కెట్లలో పని చేసే కార్మికులకు ఈ వ్యాధి ఎక్కువగా వస్తోంది. వ్యాధి నివారణకు జిల్లాలోని అన్ని ఏరియా ప్రభుత్వాసుపత్రుల్లో తగిన ఏర్పాట్లు ఉన్నాయి. జిల్లాలో క్షయ కేసుల సంఖ్య పెరగడానికి స్థానిక పరిస్థితులే కారణమని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. వాతావరణంలో దుమ్ము ధూళి కణాలు పెరిగిపోవడం వలన క్షయ విస్తరిస్తోంది. క్షయ వ్యాధిగ్రస్తులు తుమ్మినా, దగ్గినా వారి నుంచి వచ్చే బ్యాక్టీరియా గాల్లోని దుమ్ము ధూళి కణాలకు అతుక్కుపోయి, ఇతరులు ఆ గాలి పీల్చినపుడు వారి శరీరంలోకి చేరి వ్యాధిబారిన పడుతున్నారు. గతంలో మురికి వాడలు, ఏజెన్సీ ప్రాంతాలకే పరిమితమైన ఈ వ్యాధి, ప్రస్తుతం దుమ్ము ధూళి కణాల ద్వారా అన్ని ప్రాంతాలకు విస్తరిస్తోంది. వైద్యులు చెబుతున్న ప్రకారం ప్రతి 10 మందిలో నలుగురిలో క్షయ క్రిమి ఉంటుంది. ఒంట్లో క్రిమి ఉన్నంత మాత్రాన వాళ్లంతా క్షయ బాధితులేం కాదు. శరీరంలో ఉండే రోగ నిరోధక శక్తి దానిని సమర్థవంతంగా నియంత్రణలో ఉంచుతుంది. దీనిని 'లేటెంట్ టీబీ' అంటారు. శరీరంలో ఈ క్రిమి ఉన్న 10 శాతం మందిలో మాత్రం జీవితంలో ఎప్పుడో ఒకప్పుడు వ్యాధి నిరోధక శక్తి లోపించినప్పుడు ఈ క్రిమి విజృంభించి క్షయ వ్యాధికి కారణమవుతుంది. ఇలాంటి వారిని తక్షణమే గుర్తించి సమర్థంగా చికిత్స చేస్తే ఈ క్రిమి వ్యాప్తి, విజృంభణ, ఉద్ధృతి తగ్గుతాయి. కానీ.. ఈ విషయంలో యంత్రాంగం పూర్తిస్థాయిలో విజయం సాధించలేకపోతోంది. వ్యాధి బారిన పడిన వారు ప్రభుత్వాసుపత్రులకు వెళితే తప్ప ఈ కేసులు నమోదవటం లేదు. ప్రైవేటు వైద్యులు క్షయ అనుమానిత కేసులను నేరుగా ప్రభుత్వాసుపత్రికి పంపిస్తే తప్ప ఈ కేసులు ఉన్నట్టు గుర్తించలేని పరిస్థితి. గ్రామాలు, వార్డుల స్థాయిలో సర్వే నిర్వహించకపోవడం వల్ల ఈ పరిస్థితి తలెత్తుతోంది.

# మారుతున్న సమీకరణాలు

విజయవాడ, అక్టోబరు 14, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో త్వరలోనే సమీకరణాలు మారబోతున్నాయి. తెలుగుదేశం పార్టీతో పొత్తుకు జనసేన దాదాపు సిద్ధమయిందనే చెప్పాలి. ఎన్నికలకు ఏడాది ముందు రెండు పార్టీల మధ్య సయోధ్య కుదిరే అవకాశముంది. అయితే దీనికి సూత్రధారి నాదెండ్ల మనోహర్ అని చెబుతున్నారు. ఆయన పవన్ కల్యాణ్ మైండ్ ను ఛేంజ్ చేశారన్నది జనసేనలోనూ వినిపిస్తున్న అభిప్రాయం. జనసేన పార్టీలో ఇప్పటి వరకూ నాదెండ్ల మనోహర్ కీలకమనే చెప్పాలి. ఆయన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ గా ఉన్నారు. మాదాసు గంగాధరం వంటి నేతలు పార్టీని విడిచి బయటకు వెళ్లడానికి కారణం కూడా నాదెండ్ల మనోహర్ కారణమంటారు. ఒకరకంగా జనసేన పార్టీ నుంచి గెలిచిన ఏకైక ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ పార్టీకి దూరం కావడానికి కూడా నాదెండ్ల మనోహర్ కారణమన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. జనసేన, టీడీపీతో పొత్తు కు వచ్చే ఎన్నికల్లో బీజం పడటానికి కూడా నాదెండ్ల మనోహర్ కీలకంగా మారబోతున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటికే పార్టీని నడపలేక ఆర్థిక ఇబ్బందులతో పవన్ కల్యాణ్ సినిమాలను ఎంచుకున్నారు. మరో ఐదేళ్లు అధికారానికి దూరంగా ఉంటే మరింత ఇబ్బంది పడతామని నాదెండ్ల పదే పదే పవన్ కల్యాణ్ కు చెప్పడంతో ఆయన టీడీపీతో పొత్తుకు సిద్ధమయ్యారని తెలిసింది. పదేళ్లుగా శాసనసభకు దూరంగా ఉన్న నాదెండ్ల మనోహర్ కు కూడా టీడీపీతో పొత్తు ప్రయోజనకరమే. తెనాలిలో తన సీటుకు ఢోకా ఉండదని కూడా ఆయన భావిస్తున్నారని పార్టీలో గుసగుసలు విన్పిస్తున్నాయి. అందుకే కమ్మ సామాజికవర్గానికి అనుకూలంగా పవన్ కల్యాణ? చేత నాదెండ్ల మనోహర్ మాట్లాడించారంటున్నారు. మొత్తం మీద టీడీపీ నాదెండ్ల మనోహర్ సహకారంతో మరోసారి అధికారంలోకి వచ్చే ప్రయత్నాలు చేస్తుంది.

# నిధుల గోల్‌మాల్‌లో మరో ట్విస్ట్

విజయవాడ, అక్టోబరు 14, (న్యూస్ పల్స్)తెలుగు రాష్ట్రాల్లో సంచలనంగా మారిన తెలుగు అకాడమీ నిధుల గోల్‌మాల్‌లో మరో ట్విస్ట్ బయటపడింది. ఏపీలో రెండు ప్రభుత్వ సంస్థల ఎఫ్‌డీలను కూడా గోల్‌మాల్ చేసినట్లు తేలింది. ప్రధాన నిందితుడు సాయికుమార్ ఏపీ గిడ్డంగుల సంస్థ, ఏపీ నూనెగింజల సంస్థల ఎఫ్‌డీలను కొల్లగొట్టాడని హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు గుర్తించారు. తెలుగు అకాడమీ స్కామ్‌పై కోర్టుకు సమర్పించిన రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన విషయాలను చెప్పారు. ఏపీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌కు చెందిన సుమారు రూ.10కోట్లు, ఏపీ ఆయిల్‌ఫెడ్‌కు చెందిన రూ.5కోట్లు విలువైన ఎఫ్‌డీలను దారి మళ్లించినట్లు ఈ నెల 10న అధికారులు గుర్తించారు. దీంతో బ్యాంకు అధికారులు అంతర్గతంగా విచారణ జరిపారు. వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌కు సంబంధించిన ఎఫ్‌డీలు విజయవాడ భవానీపురంలోని ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్‌లో ఉన్నాయి. ఐవోబీ నుంచి ఎఫ్‌డీ సొమ్మును ఏపీ మర్కంటైల్ కోఆపరేటివ్ సొసైటీకి బదిలీ చేసి.. అక్కడి నుంచి సాయికుమార్ ముఠా సొమ్ము డ్రా చేసినట్లు అధికారులు గుర్తించారు. ఆయిల్‌ఫెడ్‌కు చెందిన ఎఫ్‌డీలు వీరపునాయునిపాలెం సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లో ఉన్నాయి. అందులోని రూ.5కోట్ల ఎఫ్‌డీనీ కొట్టేసినట్లు గుర్తించారు. కాగా, మర్కంటైల్ సొసైటీ చైర్మన్ సత్యనారాయణరావుకు భారీగా కమిషన్ ఇచ్చి నిధులు విత్ డ్రా చేయడంలో సాయికుమార్ కీలక పాత్ర పోషించినట్లు తెలంగాణ పోలీసులు.. ఏపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. దీంతో ఏపీ సీఐడీ ద్వారా ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు మొదలు పెట్టనున్నట్లు తెలుస్తోంది. ఐవోబీ బ్యాంకు ఉద్యోగుల పాత్రపైనా ఆరా తీస్తున్నారు. ఏపీ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్, ఏపీ ఆయిల్‌ఫెడ్‌లో ఎఫ్‌డీల సొమ్ము దారి మళ్లినట్లు గుర్తించామని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. దీనిపై విచారణ జరుగుతోందని.. సొమ్ము కొట్టేసిన వారిపై చట్టపరంగా చర్యలుంటాయన్నారు. ఆయా బ్యాంకుల అధికారులు అంతర్గత విచారణ జరుపుతున్నారని.. ఎవరెవరి పాత్ర ఉందో విచారణ జరుపుతామన్నారు

# ఎన్నికల ముందే ప్రణాళికలు

విజయవాడ, అక్టోబరు 14, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీకి ఒకప్పుడు తూర్పు గోదావరి జిల్లాలో మంచి పట్టు ఉండేది. 2019 ఎన్నికల ఫలితాల తర్వాత ఈ జిల్లాలో నేతలు అనే వారు లేకుండా పోయారు. 19 నియోజకవర్గాలుంటే అందులో ఒకరిద్దరు మాత్రమే యాక్టివ్ గా ఉండటం విశేషం. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా జిల్లాలో నేతలు పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం చర్చనీయాంశంగా మారింది. అధికారంలో ఉన్నప్పుడు పదవులు దక్కించుకున్న వారు సయితం మొఖం చాటేశారు. తూర్పు గోదావరి జిల్లాలో టీడీపీకి సీనియర్ నేతలున్నారు. గత ఎన్నికల్లో ఈ జిల్లాలో నాలుగు నియోజకవర్గాల్లో మాత్రమే టీడీపీ విజయం సాధించింది. వీరిలో గోరంట్ల బుచ్చయ్య చౌదరి, నిమ్మకాయల చినరాజప్పలు యాక్టివ్ గా ఉన్నారు. రాజమండ్రి అర్బన్ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావులు చురుగ్గా లేరు. ఎమ్మెల్సీగా ఉన్న యనమల రామకృష్ణుడు అప్పుడప్పుడు మీడియా సమావేశాలు పెట్టడం తప్ప జిల్లాలో పార్టీని బలోపేతం చేసే ప్రయత్నం చేయడం లేదు. కొద్దో గొప్పో అనపర్తి మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కొంత చురుగ్గానే ఉన్నారు. మిగిలిన నేతలందరూ కాడి కిందపడేశారనే చెప్పాలి. ఎవరూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. క్యాడర్ కు కూడా దూరంగా ఉంటున్నారు. నియోజకవర్గాల్లో పర్యటనలు కూడా చేయడం లేదు. ఇటీవల రైతు కోసం ఇచ్చిన కార్యక్రమంలో కూడా కొన్ని నియోజకవర్గాల్లో మాత్రమే నేతలు పాల్గొన్నారు. దీనిపై చంద్రబాబు సీరియస్ అయినట్లు తెలుస్తోంది. జనసేనతో పొత్తు ఉంటుందని సంకేతాలు బయటకు రావడంతో నేతలు కూడా నిరాశలో ఉన్నారని తెలిసింది. ఈ జిల్లాలోనే జనసేన ఎక్కువ స్థానాలను కోరే అవకాశముంది. అందుకే ఇప్పటి నుంచి లేని పోని ఖర్చు ఎందుకన్న నిరాశలో అనేక మంది నేతలు ఉన్నారు. అందుకే ఖర్చు చేసేందుకు, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఎవరూ ఉత్సాహం చూపడం లేదు. పొత్తుకు ముందే ఈ జిల్లాలో టీడీపీపై భారీ ఎఫెక్ట్ పడినట్లే కనపడుతుంది.

# రబీ ఆశాజనకం

గుంటూరు, అక్టోబర్ 14, (న్యూస్ పల్స్)రబీలో సాగు ఆశాజనకంగా ఉంటుందని భావిస్తున్నారు. ప్రధానంగా జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో పుష్కలంగా వర్షాలు కురవడంతో పాటు, నాగార్జునసాగర్ రిజర్వాయర్, పులిచింతల ప్రాజెక్టులు నిండుకుండలను తలపిస్తున్నాయి. ఎగువ పరీవాహక ప్రాంతాల నుంచి ఇప్పటికీ వరద వచ్చి చేరుతుండటంతో ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు సముద్రంలోకి నీరు పెద్దఎత్తున విడుదల చేస్తున్నారు. దీంతో పశ్?చమ డెల్టా, నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో పంటలకు రబీలో ఢోకా ఉండదని రైతులు భావిస్తున్నారు. వ్యవసాయ అధికారులు సైతం ప్రస్తుత పరిస్థితులకనుగుణంగా ఈ ఏడాది సాధారణ విస్తీర్ణం కంటే ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగవుతాయని భావిస్తున్నారు. రబీలో సాధారణ సాగు 4,88,130 ఎకరాలు కాగా, ఈఏడాది రబీలో 5,80,587.5 ఎకరాల్లో పంటలు సాగు అవుతాయని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. అంటే 92,457.5 ఎకరాల్లో అదనంగా పంటలు సాగు కానున్నాయి. గత ఏడాది రబీలో పంటలు 4,83,327.5 ఎకరాల్లో మాత్రమే సాగు అయ్యాయి. జిల్లాలో ప్రధానంగా రబీలో జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర పంటలు సాగవుతాయి. ఈ ఏడాది ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉండటం వల్ల వరి సాధారణ సాగు 45,150 ఎకరాలు కాగా, 75 వేల ఎకరాల్లో వరి పంట సాగు అవుతోందని వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేశారు.

# భూమాకు టాస్క్ పెద్దదే



కర్నూలు, అక్టోబరు 14, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్లు మాత్రమే సమయం ఉంది. టీడీపీ నేతలు ఇప్పుడిప్పుడే యాక్టివ్ అవుతున్నారు. ప్రధానంగా కొందరికి వచ్చే ఎన్నికలు జీవన్మరణ సమస్య. ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియకు వచ్చే ఎన్నికలు ఒక ఛాలెంజ్ అనే చెప్పాలి. వచ్చే ఎన్నికల్లోనూ గెలవకపోతే భూమా అఖిలప్రియకు రాజకీయంగా మరిన్ని ఇబ్బందులు ఎదురవుతాయి. ఇప్పటికే అనేక కేసుల్లో ఆమె ఇరుక్కుని సతమతమవుతున్నారు.నిజానికి భూమా కుటుంబంలో నాగిరెడ్డి, శోభ తర్వాత అంత స్థాయిలో ప్రభావితం చేయగలిగిన నేత ఆ కుటుంబం నుంచి ఎవరూ రాలేదు. భూమా అఖిలప్రియకు ఆ వారసత్వం వహిస్తుందని భావించారు. కానీ బ్యాడ్ లక్ ఆమె నేరుగా ఎన్నికల్లో గెలవలేకపోయారు. తొలిసారి గెలిచింది ఏకగ్రీవంతోనే. ఆ తర్వాత ఎన్నికల్లో ఘోర ఓటమిని చవిచూశారు. తన తండ్రి ప్రాతినిధ్యం వహించిన నంద్యాలతో సయితం ఉప ఎన్నికల్లోనే ఆ కుటుంబం విజయం సాధించిందిఇప్పుడు భూమా అఖిలప్రియ ముందు పెద్ద టాస్కే ఉంది. తొలుత కుటుంబాన్ని చక్కదిద్దుకోవాల్సి ఉంటుంది. భూమా అఖిలప్రియ మంత్రిగా ఉన్నా ఆ కుటుంబంలో విభేదాలు తలెత్తాయి. ముఖ్యంగా ఆమె వివాహం తర్వాత కుటుంబ సభ్యులు ఒక్కొక్కరుగా ఆమె నుంచి విడిపోయారు. దీంతో ఆళ్లగడ్డలో భూమా కుటుంబం పట్టు సడలింది. గంగుల కుటుంబాన్ని ధీటుగా ఎదుర్కొనాలంటే తిరిగి కుటుంబ సభ్యులను తన చెంతకు అఖిల ప్రియ చేర్చుకోవాల్సి ఉ ంటుంది.భూమా అఖిలప్రియ ప్రస్తుతం ఆళ్లగడ్డలోనే ఉంటున్నారు. పార్టీ కార్యక్రమాలను కూడా తరచూ నిర్వహిస్తున్నారు. తన వద్దకు వచ్చిన కార్యకర్తలతో మనసు విప్పి మాట్లాడుతున్నారు. భర్త ను ప్రస్తుతం ఆళ్లగడ్డ రాజకీయాలకు దూరంగా ఉంచారు. తానే సొంత నిర్ణయాలు తీసుకుంటున్నారు. అవసరమైన కార్యకర్తలకు ఆర్థికసాయం చేస్తూ అండగా ఉంటున్నారు. మరి ఆళ్లగడ్డ లో భూమా అఖిలప్రియ ఈసారైనా పట్టుసాధిస్తుందా? అనేది చూడాల్సి ఉంది.

# ఓవర్ టూ ఉత్తరాంధ్ర...

విశాఖపట్టణం, అక్టోబరు 14, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ ఆ నిర్ణయం తీసుకుంటారా? జగన్ ఆలోచన అదే విధంగా ఉందా? ఈసారి జగన్ రెండుచోట్ల నుంచి పోటీ చేయాలని భావిస్తున్నారా ? అంటే అవుననే అంటున్నాయి పార్టీ వర్గాలు. జగన్ రాజకీయంగా ఆలోచించే ఈ నిర్ణయం తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటున్నారు. వచ్చే ఎన్నికలు జగన్ కు ముఖ్యం. రెండోసారి గెలిచి విపక్ష టీడీపీని పూర్తిగా నిర్వీర్యం చేయాలన్న ఆలోచనతో ఉన్నారు.వైఎస్ జగన్ ఇప్పటి వరకూ ఎప్పుడూ రెండు చోట్ల నుంచి పోటీ చేయలేదు. ఆయన ఎప్పుడైనా పులివెందుల నుంచి పోటీ చేస్తారు. అక్కడ పెద్దగా ప్రచారానికి కూడా వెళ్లరు. ఎందుకంటే పులివెందుల వైఎస్ కుటుంబానికి కంచుకోట. అక్కడ ప్రత్యర్థి పార్టీల అభ్యర్థులు కూడా జగన్ దరిదాపుల్లో ఉండరు. పులివెందులలో ఇప్పటికే వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేశారు. విపక్షాలు సయితం జగన్ పులివెందులకు దోచి పెడుతున్నారని విమర్శలు కూడా చేస్తున్నారు.అయితే ఈసారి జగన్ ఉత్తరాంధ్ర నుంచి కూడా పోటీ చేయాలని జగన్ భావిస్తున్నారు. అందుకు కారణాలు కూడా పార్టీ నేతలు చెబుతున్నారు. జగన్ మూడు రాజధానులను ప్రకటించినా న్యాయస్థానాలకు వెళ్లి విపక్షాలు దానిని సమర్థవంతంగా అడ్డుకున్నాయి. అమరావతి రైతులు కూడా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో ఆ కేసు ఎప్పటికి తేలుతుందో ఎవరికీ తెలియదు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి స్థాయిలో ఉత్తరాంధ్రలో పోటీ చేయాలని భావిస్తున్నారంటున్నారు.పులివెందులతో పాటు ఉత్తరాంధ్రలో కీలక నియోజకవర్గం నుంచి జగన్ పోటీ చేయాలను కుంటున్నారు. దీనివల్ల ఉత్తరాంధ్ర లో వైసీపీ మరింత బలోపేతం అవుతుంది. రాయలసీమలో ఎటూ వైసీపీ అత్యధిక స్థానాలు దక్కించుకుంటుంది. ప్రకాశం, నెల్లూరు జిల్లాలను మినహాయిస్తే గుంటూరు, కృష్ణాలోనే పార్టీ కొంత దెబ్బతినే అవకాశముందన్న లెక్కలు వేస్తున్నారట. ఇటీవల ఉత్తరాంధ్ర కు చెందిన ముఖ్యనేతతో జగన్ ఈ విషయాన్ని ప్రస్తావించినట్లు చెప్పుకుంటున్నారు. మొత్తం మీద జగన్ ఎన్నడూ లేని విధంగా ఈసారి రెండుచోట్ల నుంచి జగన్ పోట ?చేస్తారంటున్నారు.

# రూ. 50 కి చేరిన టమాటా

కర్నూలు, అక్టోబరు 14, (న్యూస్ పల్స్)రైతుల పరిస్థితి ఎప్పుడెలాగుంటుందో వాళ్లకే తెలియడం లేదు. రైతు కష్టాన్ని పక్కనబెడితే కనీసం పెట్టిన పెట్టుబడి కూడా దక్కక అన్నదాతలు అప్పుల పాలవుతున్నారు. కూరగాయలు పండించే రైతుల పరిస్థితి అయితే మరి దారుణంగా మారింది. మొన్నటివరకు టమాటా రైతులది ఇదే పరిస్థితి. టమాటా ధరలు పాతాళానికి పడిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు.మొన్నటివరకు టమోటా రైతులు గిట్టుబాటు ధర లేక టమాటాను రోడ్లపై పారబోశారు. మరికొందరు పంటను పశువులకు వదిలేశారు. రైతులు టమాటా పంట తీసివేయటంతో వెంటనే టమాటా ధరలకు ఒక్కసారిగా రెక్కలు వచ్చాయి. మొన్నటివరకు చాలా కిలో రూ.10 పలికిన టమాటా ఇప్పుడు ఏకంగా రూ 50 పలుకుతోంది. ఒక్కసారిగా పెరిగిన ధరలతో టమాటా రైతులే ఆశ్చర్యపోతున్నారు. తమకు మంచి రోజులు వచ్చాయంటూ సంతోషం



వ్యక్తంచేస్తున్నారుఆంధ్రప్రదేశ్?లోని కర్నూలు జిల్లా పత్తికొండ మార్కెట్‌కు పెద్దఎత్తున టమాటా తరలివస్తోంది. టమాటా ఎక్కువగా పండే తుగ్గలి, మద్దిగెర, జొన్నగిరి ప్రాంతాల నుంచి పత్తికొండ మార్కెట్‌కు చేరుతోంది. ఒకవైపు డిమాండ్? మరోవైపు ఎగుమతులు పెరగడంతో టమాటా సప్లై చేయలేని పరిస్థితి ఏర్పడుతోంది. టమాటాకు మంచి ధర పలుకుతోన్నా ఆ స్థాయిలో పంట దిగుమతి లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో టమాటా పంటలు దెబ్బతిని దిగుబడి పడిపోయింది. ధర ఉన్నప్పుడేమో దిగుబడి ఉండదు. మంచి దిగుబడి ఉంటే ధర ఉండదు. ఇలా, ఎలా చూసినా నష్టపోయేది మాత్రం రైతన్నే అవుతున్నాడు.అయితే టమాటా ధర పెరగడంతో సామాన్యుడిపై భారం పడనుంది. ఇప్పిటికే పెట్రోల్, డిజీల్, వంట నూనె ప్రజల నడ్డివిరుస్తోంది. తాజాగా టమాటా ధర పెరగటంతో కొందరు టమాటా వాడకాన్ని తగ్గిస్తున్నారు. ఉల్లి రేటు కూడా పెరగటంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

# కాపుల పథకాలు నిర్వీర్యం

విజయవాడ అక్టోబరు 14, (న్యూస్ పల్స్) జగన్ రెడ్డి కాపులకు ఇచ్చిన హామీలు ఆకాశంలో.. అమలు పాతాళంలో వుంది. కాపులకు గత రెండు దశాబ్దాలలో జరగని అన్యాయం వైసీపీ రెండున్నరేళ్ల పాలనలో జరిగింది. వైసీపీ పాలనలో కాపులకు ఒనగూరిన ప్రయోజనం శూన్యమని టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ ఆరోపించారు. టీడీపీ హయాంలో కాపులకు రాజకీయంగా, సామాజికంగా అన్ని విధాల గౌరవం కల్పిస్తే జగన్ రెడ్డి కాపు సంక్షేమాన్ని గాలికొదిలారు. చంద్రబాబు హయాంలో కాపులకు అమలు చేసిన సంక్షేమ పథకాలు రద్దు చేయటమే కాక కార్పోరేషన్ ను నిర్వీర్యం చేశారు. నవరత్నాలు అంటూ నలుగురికి అందించిన సంక్షేమ పథకాలే కాపులకు అమలు చేస్తున్నారు తప్ప.. కాపులకు అంటూ ప్రత్యేకంగా అమలు చేసిన పథకాలు శూన్యం. జగన్ రెడ్డి అబద్దపు మాటలు చెబుతూ అవినీతి మూటలు సర్దుకుంటూ కాపులకు మోసం చేస్తున్నారు. కాపులకు విద్య, ఉద్యోగ అవకాశాల్లో తెలుగుదేశం కల్పించిన 5శాతం రిజర్వేషన్లను అడ్డగోలుగా రద్దు చేశారు. ఫలితంగా కేవలం సచివాలయ ఉద్యోగాల్లోనే దాదాపు 12వేల మంది నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు కోల్పోయారు. కాపు భవన్లను నిలిపివేశారు, మరో వైపు కాపు నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారు. చివరికి కౌలు రైతుల్లో కూడా కులాన్ని తెచ్చి రైతు భరోసా అందకుండా చేశారు. విద్యార్థులకు విదేశీ విద్య లేదు. నిరుద్యోగులకు భృతి లేదు. జగన్మోహన్ రెడ్డి రెండున్నరేళ్ల పాలనలో కాపులకు ఏం చేశారో చర్చకు రాగలరా అని ప్రశ్నించారు.

# చోరీకేసులలో రూ.10,13, 500 విలువైన సొత్తు స్వాధీనం

మండపేట... అక్టోబరు 14, (న్యూస్ పల్స్) పట్టణ పరిధిలో జరిగిన వివిధ చోరీకేసులలో రూ. 10,13,500, రెండు మోటార్ సైకిళ్ళు స్వాధీనం చేసుకున్నామని రామచంద్రపురం డిఎస్పి డి. బాలచంద్రారెడ్డి అన్నారు. గురువారం స్థానిక పట్టణ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ కేసులకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఏలూరు, తాడేపల్లిగూడెంలకు చెందిన కోసూరి రమేష్, అరటిపండు, మండపేటకు చెందిన వాసంశెట్టి దుర్గాప్రసాద్ లు వ్యసనాలకు బానిసై దొంగతనాలకు అలవాటు పడ్డారని, స్థానిక గోల్డ్ మార్కెట్, రామచంద్రపురం లోని బంగారం షాపులలో బంగారం, వెండి వస్తువులను, కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా రెండు మోటార్ సైకిల్ లను దొంగిలించారని వీటిలో సుమారు 44 గ్రాముల బంగారు వస్తువులు మచిలీపట్నం, శ్రీకాళహస్తిలో మనప్పురం ఫైనాన్స్ లలో తాకట్టు పెట్టినట్లు తెలిపారు. ఈ కేసులపై మూడు బృందాలుగా దర్యాప్తు సాగుతున్న నేపథ్యంలో గురువారం ఏడిద రోడ్డులోని వాహనాలు తనిఖీ చేస్తుండగా ముగ్గురు వ్యక్తులు రెండు మోటార్ సైకిల్ పై వస్తుండగా అనుమానంతో వారిని పట్టుకుని విచారించగా దొంగతనానికి పాల్పడినట్లు ఒప్పుకొన్నారు.

కేసులకు సంబంధించి 126 గ్రాముల బంగారం, 6.50 కేజీల వెండి, మోటార్ సైకిల్ ను స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన సిబ్బందిని ఆయన అభినందించి వారికి రివార్డు ప్రకటించేందుకు ప్రభుత్వానికి సిఫార్సు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ ఆదాయానికి, ప్రజల ఆరోగ్యాలకు హాని కలిగిస్తున్న సారా విక్రయాలు అడ్డుకోవడంలో భాగంగా సారా విక్రయదారుల పై కఠిన చర్యలు చేపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో రూరల్ సిఐ శివ కృష్ణ పట్టణ ఎస్ఐ బి రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

# చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి

అనంతపురం, అక్టోబర్ 14 చెడుపై మంచి, దుష్ట శక్తుల మీద దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి పండుగ అని రాష్ట్ర రహదారులు మరియు భవనాల శాఖ మంత్రి మాలగుండ్ల శంకర నారాయణ అన్నారు. జగన్మాత ఆశీస్సులతో ప్రజలంతా సుఖ శాంతులతో, సిరి సంపదలతో తులతూగాలని, ప్రతి ఒక్క కుటుంబానికి విజయాలు వరించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలందరికీ విజయదశమి పండుగ శుభాకాంక్షలను మంత్రి తెలియజేశారు. దసరా హిందువులకు ముఖ్యమైన పండుగని, ఆశ్వియుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు తొమ్మిది రోజులు దేవీ నవరాత్రులతో కలిసి పదవ రోజు విజయ దశమి కలసి దసరా పండుగ జరుపుకుంటారని, ఇది ముఖ్యముగా శక్తి ఆరాధనకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చే పండుగ అన్నారు. విజయదశమి పండుగ సందర్భంగా

**జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు**
**రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి మాలగుండ్ల శంకర నారాయణ**

దుర్గామాత ఆశీస్సులు ప్రతి ఒక్క కుటుంబాలకు ఉండాలని, అందరూ అష్టైశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో తులతూగుతూ ఉండాలన్నారు.రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ఎంతో పాటు పడుతున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి దుర్గామాత ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు. కరోనా నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటిస్తూ విజయ దశమి పండుగను జరుపుకోవాలని మంత్రి సూచించారు.

# భూమన చొరవతో రుయా ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది కి అందిన జీతాలు

**- భూమన కుటుంబానికికృతజ్ఞతలు తెలిపిన సెక్యూరిటీ సిబ్బంది**

తిరుపతిఅక్టోబరు 14, (న్యూస్ పల్స్)చాలా కాలంగా జీతాలు అందకుండా ఇబ్బందులు పడుతున్న రుయా ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బందికి... తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి కృషితో జీతాల సమస్య పరిష్కారమైంది. దీంతో రుయా ఆసుపత్రి సెక్యూరిటీ సిబ్బంది కృతజ్ఞతా పూర్వకంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డిని, తన వంతు సహాయ సహకారాలను అందించిన నగర మేయర్ భూమన అభినయ్ రెడ్డి, రుయా అభివృద్ధి కమిటీ వర్కింగ్ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ ని కలిశారు. ఈ మేరకు పద్మావతిపురంలోని భూమన నివాసం వద్ద గురువారం ఉ దయం పుష్ప గుచ్చాలు సమర్పించి, దుశ్శాలువలతో సత్కరించారు. ఈ సందర్భంగా రుయా సెక్యూరిటీ సిబ్బంది మాట్లాడుతూ...ఆపద సమయంలో తమకు అండగా నిలుస్తున్న భూమన కుటుంబానికి తాము ఎల్లవేళలా రుణపడి ఉంటామని ప్రకటించారు. సుమారు 12 నెలల నుంచి జీతాలు అందక ఇబ్బంది పడ్డామని...ఈ నేపథ్యంలో తమ సమస్యనుభూమన కరుణాకర రెడ్డికి తీసుకొచ్చామని, దీంతో ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. చొరవ తీసుకుని తమ సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కి తీసుకొచ్చి పరిష్కరించారన్నారు. ప్రస్తుతానికి 7 నెలల జీతాలు అందాయని, మిగిలిన జీతాన్ని ఇప్పించేలా కరుణాకర రెడ్డి, అభినయ్ కృషి చేస్తామని హామీ ఇచ్చారన్నారు. తమకు సహాయ సహకారాలను అందించిన రుయా అభివృద్ధి వర్కింగ్ కమిటీ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ కు కృతజ్ఞతలు తెలియజేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు మురళి, విశ్వనాథ్,రాధాకృష్ణ, రవి, శివ పాల్గొన్నారు.

# ప్రకాశంలో సైకో

ఒంగోలు, అక్టోబరు 14, (న్యూస్ పల్స్)ఏపీలో ప్రకాశంజిల్లా కనిగిరిలో ఓ యువకుడు హల్‌చల్ చేశాడు. పామూరు బస్టాండ్ సెంటర్‌లో ఆర్టీసీ బస్సుపై పెట్రోల్ పోసి నిప్పంటించాడు. వెంటనే అప్రమత్తమైన స్థానికులు మంటలను ఆర్పేశారు. కాగా, ఈ సంఘటనలో బస్సు పాక్షికంగా దగ్ధమైంది. పెట్రోల్ పోసిన యువకుడు వెలిగండ్ల మండలం మొగళ్లూరుకు చెందిన ఏడుకొండలుగా గుర్తించారు. ఇక ఆర్టీసీ సిబ్బంది సమాచారం అందించడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బస్సుపై పెట్రోల్ పోసి నిప్పు అంటించిన ఏడుకొండలును అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించగా.. పొంతనలేని సమాధానాలు చెప్పాడు. దాంతో అతనికి మతిస్థిమితం లేనట్టుగా గుర్తించారు. పెరిగిన పెట్రోల్, డీజిల్, బంగారం, వెండి ధరలకు నిరసనగా బస్సుకు నిప్పంటించానని, ధరలు తగ్గేందుకు అందరూ పూజలు చేయాలంటూ ఏడుకొండలు వింత వింతగా మాట్లాడాడు. అయితే, ఏడుకొండలు ధరించిన టీ షర్ట్‌పై జనసేన అధినేత పవన్ కళ్యాణ్ బొమ్మ ఉంది. ఈ నేపథ్యం జనసేన కార్యకర్తలకు ఏడుకొండలుతో ఏమైనా పరిచయాలు ఉన్నాయేమో అనే కోణంలోనూ పోలీసులు విచారణ జరుపుతున్నారు.కాగా, దీనికి ముందు అంటే.. బస్సుకు నిప్పంటించే సమయంలో బస్సులో ఉన్న ఏడుకొండలు డ్రైవర్ సీటు విండోలో నుంచి మాట్లాడుతూ సీయం జగన్ వచ్చి పెరిగిన ధరలపై సమాధానం చెప్పాలని పెద్ద పెద్దగా అరిచాడు. దాంతో అలర్ట్ అయిన స్థానికులు అతన్ని వారించేందుకు ప్రయత్నించారు. మరింత రెచ్చిపోయిన ఏడుకొండలు వారిని బూతులు తిట్టాడు. ఇక ఏడుకొండలు ని పట్టుకునేందుకు వచ్చిన పోలీసులకు సైతం చుక్కలు చూపించాడు. అతన్ని పట్టుకునేందుకు పోలీసులు నానా కష్టాలు పడాల్సి వచ్చింది. చివరకు ఏడుకొండలును అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

# తెప్పోత్సవం కార్యక్రమంపై అధికారుల కీలక ప్రకటన

విజయవాడ అక్టోబరు 14, (న్యూస్ పల్స్) ప్రతియేటా కృష్ణా నదిపై జరిగే తెప్పోత్సవంపై అధికారులు కీలక ప్రకటన చేసారు. జిల్లా కలెక్టర్ నివాస్ మాట్లాడుతూ ఇంద్రకీలాద్రిపై నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కృష్ణా నదిలో లక్ష క్యూసెక్ ల వరకూ నీరు వదులుతున్నారు. అందుకే ఈసారి కూడా ఘంటు పై మాత్రమే పూజలు నిర్వహిస్తారు. తెప్పోత్సవం ఆగమన నియమనిబంధనలకు అనుగుణంగా జరుపుకుంటాం. తెప్పోత్సవం ప్రాణగంలో ప్రజలకు అనుమతి లేదు. సుమారు 5:30 గంటలకు పూజాదికార్యక్రమాల తర్వాత తెప్పోత్సవం ఉ ంటుంది. నవరాత్రి సంబరాలు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జరిగాయి, భక్తులు కూడా సహకరించారు. ఇంకా రెండుమూడు రోజులు భక్తులు, భవానీలు వచ్చే అవకాశం ఉంది కాబట్టి కావాల్సిన సదుపాయాలు ఏర్పాటు చేసాం. దసరా ఉ త్సవాలు సజావుగా జరగడానికి సహకరరించిన ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలని అన్నారు.పోలీసులు కమిషనర్ బత్తిన శ్రీనివాసులు మాట్లాడుతూ గత ఏడు రోజులుగా దసరా ఉత్సవాల విజయవంతంగా జరిగాయి. అనుకున్న దానికంటే భక్తులు ఎక్కువగా వచ్చారు. అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఉత్సవాలు జరుపుకున్నాము. శుక్రవారం భక్తుల తాకిడి ఎక్కువ ఉంటుంది కనుక అన్ని ఏర్పాట్లు చేసాము. రేపు సాయంత్రం 5:30 గంటలకు తెప్పోత్సవం కార్యక్రమం జరుగుతుంది. దానికి సంబంధించిన బందోబస్తు ఏర్పాటు చేశామ్. కనకదుర్గ ఫ్లై ఓవర్, కుమ్మరిపాలెం వైపు ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని అన్నారు.

# సర్వ భూపాల వాహనం శ్రీనివాసుడు

తిరుమల అక్టోబరు 14, (న్యూస్ పల్స్)బ్రహ్మోత్సవాలు ఈరోజు ఎనిమిదో రోజుకి చేరుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 7.35 నుండి 9 గంటల వరకు రథోత్సవం బదులుగా శ్రీవారి ఆలయంలోని కల్యాణోత్సవ మండపంలో శ్రీమలయప్ప స్వామివారు ఉభయదేవేరులతో కలిసి సర్వభూపాల వాహనంపై దర్శనమిచ్చారు.సర్వభూపాల అంటే రాజులకు రాజు అని అర్థం. ఈ ప్రపంచాన్ని మొత్తం పాలించే రాజు తానేనని భక్త లోకానికి చాటి చెపుతూ స్వామివారు ఈ వాహనాన్ని అధిష్టించారు.ఈ కార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, శాసనసభ ఉప సభాపతి శ్రీ కోన రఘుపతి, టిటిడి ఈవో డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి దంపతులు, బోర్డు సభ్యులు శ్రీమతి ప్రశాంతి రెడ్డి, శ్రీ ఎపి.నందకుమార్, అదనపు ఈవో శ్రీ ఎవి.ధర్మారెడ్డి దంపతులు, సివిఎస్వో శ్రీ గోపినాథ్ జెట్టి దంపతులు, విజివో శ్రీ బాలిరెడ్డి, ఆలయ డెప్యూటీ ఈవో శ్రీ రమేష్‌బాబు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సర్వభూపాల వాహనంలో మలయప్ప స్వామి

తిరుమల అక్టోబరు 14, (న్యూస్ పల్స్) శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజు ఉదయం శ్రీవారి ఆలయంలోని కల్యాణోత్సవ మండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారు సర్వభూపాల వాహనంలో దర్శనమిచ్చారు. ఆలయంలో ఏకాంతంగా బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్న కారణంగా రథోత్సవానికి బదులుగా సర్వభూపాల వాహనసేవ జరిగింది.. సర్వభూపాల అంటే అందరు రాజులు అని అర్థం. వీరిలో దిక్పాలకులు కూడా చేరతారు. తూర్పుదిక్కుకు ఇంద్రుడు, ఆగ్నేయానికి అగ్ని, దక్షిణానికి యముడు, నైరుతికి నిరృతి, పశ్చిమానికి వరుణుడు, వాయువ్యానికి వాయువు, ఉత్తరానికి కుబేరుడు, ఈశాన్యానికి పరమేశ్వరుడు అష్టదిక్పాలకులుగా విరాజిల్లుతున్నారు. వీరందరూ స్వామివారిని తమ భుజస్కంధాలపై, హృదయంలో ఉంచుకుని సేవిస్తారు. తద్వారా వారి పాలనలో ప్రజలు ధన్యులవుతారు అనే సందేశాన్ని ఈ వాహనసేవ నుంచి గ్రహించవచ్చు

# శ్రీవారిని దర్శించుకున్న పెళ్లి సందడి బృందం

తిరుమల అక్టోబరు 14, (న్యూస్ పల్స్) తిరుమల శ్రీవారిని పెళ్ళి సందడి చిత్ర యూనిట్ సభ్యులు దర్శించుకున్నారు.. ఇవాళ ఉదయం వి.ఐ.పి విరామ సమయంలో సినీ నటులు రోషన్,శ్రీలేఖ,డైరెక్టర్ గౌరీ రొనోంకి లు స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు..అనంతరం వీరికి రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా..ఆలయ అధికారులు పట్టు వస్త్రాలతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.. అనంతరం సినీనటుడు రోషన్ మాట్లాడుతూ.. పెళ్లి సందడి సినిమా రేపు విడుదల కానున్న నేపథ్యంలో శ్రీవారిని దర్శించుకున్నాంమని, శ్రీవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.. అనంతరం సినీ హీరో శ్రీలేఖ మీడియాతో మాట్లాడుతూ.. సినిమా విడుదల సందర్భంగా చిత్ర యూనిట్ మొత్తం తిరుమల వచ్చాంమన్నారు.. అనంతరం సినీ డైరెక్టర్ మీడియాతో మాట్లాడుతూ.. మంచి ఫ్యామిలీ ఎంటర్టైనర్ సినిమా తీసాంమని,కుటుంబ సభ్యులందరు చూడదగిన సినిమా అని, రేపు చిత్రం విడుదల సందర్భంగా స్వామి వారి ఆశీస్సుల కోసం తిరుమలకు విచ్చేసినట్లు డైరెక్టర్ గౌరీ రొనోంకి అన్నారు..

# ఇంద్రకీలాద్రి పై దుర్గమ్మ ను దర్శించుకున్న నటి హేమ

విజయవాడ అక్టోబరు 14, (న్యూస్ పల్స్) నటి హేమ గురువారం ఉదయం ఇంద్రకీలాద్రి పై దుర్గమ్మ ను దర్శించుకున్నారు. తరువాత ఆమె మీడియాతో మాట్లాడారు. అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది. దసరా లో ప్రతీ ఏటా అమ్మవారిని దర్శించుకుంటాను. కొండంత ధైర్యం ఇవ్వమని అమ్మవారిని కోరుకున్నాను. మా ఎలక్షన్స్ లో రాత్రి గెలిచాము ఉదయం ఓడిపోయాము..ఏం జరిగిందో ఆ అమ్మవారికే తెలియాలని అన్నారు.

# పామూరు బస్టాండ్ లో సైకో హల్ చల్

ఒంగోలు అక్టోబరు 14, (న్యూస్ పల్స్)ప్రకాశం జిల్లా కనిగిరి లోని పామూరు బస్టాండ్ లో సైకో హల్చల్ చేసాడు. పల్లె వెలుగు బస్సు కు పెట్రోల్ పోసి నిప్పు పెట్టాడు. ఇది గమనించిన స్థానికులు అప్రమత్తమై మంటలను ఆర్పి వేసారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని సైకోను అదుపులోకి తీసుకున్నారు. బస్సుకు నిప్పు పెట్టిన వ్యక్తి వెలిగండ్ల మండలం మొగుల్లూరు కి చెందిన ఏడుకొండలు గా పోలీసులు గుర్తించారు.

# అనధికార వాహనాలను అడ్డుకున్న ఈవో

విజయవాడ అక్టోబరు 14, (న్యూస్ పల్స్)ఓంకార్ టర్నింగ్ వద్ద అనధికార విఐపి,వివిఐపి ల వాహనాలకు ఈఓ భ్రమరాంబ చెక్ పెట్టారు. గురువారం ఉ దయం ఓంకార్ టర్నింగ్ వద్ద స్వయానా వాహనాలను ఆమె అడ్డుకున్నారు. ప్రోటోకాల్ వాహనాలను మాత్రమే అనుమతించాలని ఈఓ ఆదేశాలు ఇచ్చారు. ఇంద్రకీలాద్రిపై విధులు నిర్వహించే వారికి మాత్రమే అనుమతి ఇస్తున్నారు. సిబ్బంది కుటుంభ సభ్యులను సైతం విఐపి క్యూ లైన్ లో ఈవో పంపిస్తున్నారు.

# జూడో పోటీలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఉషశ్రీ

కళ్యాణదుర్గం అక్టోబరు 14, (న్యూస్ పల్స్)కళ్యాణదుర్గం పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న సబ్ జూనియర్ జిల్లా స్థాయి జూడో ఛాంపియన్షిప్ 2021-22 పోటీలను ఎమ్మెల్యే ఉషశ్రీ చరణ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గా ఆమె మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి నిదర్శనం అని ప్రతి ఒక్క విద్యార్థులు క్రీడల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు, విద్యార్థులు చదువులతో పాటు క్రీడా రంగంలో కూడా రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ బిక్కి నాగలక్ష్మి, మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణీంద్ర,రూరల్ సిఐ శ్రీనివాసులు, వైఎస్సార్సీపీ కౌన్సిలర్ ఐ. సుధీర్ పాల్గొన్నారు.

# తేజేష్ రెడ్డి మృతి పట్ల పలు అనుమానాలు

**తల్లి జ్యోతి**

పీలేరు అక్టోబరు 14, (న్యూస్ పల్స్)తన కొడుకు తేజేష్ రెడ్డి మృతి పట్ల మృతుడి తల్లి జ్యోతి పలు అనుమానాలు వ్యక్తం చేసింది. ఆ ఇద్దరే నా బిడ్డను చంపించారని ఆరోపించింది. టేజేష్ దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. జ్యోతి మాట్లాడుతూ భూదేవిరెడ్డి, రవీందర్ రెడ్డి లను బహిరంగంగా ఉరి తీసి చంపాలి. డబ్బు కోసమే పంపించారు. నాకు న్యాయం చేయండి అంటూ కన్నీరుమున్నీరుగా విలపించారు. కొడుకును చంపేశారు అన్న విషయం తెలుసుకుని కువైట్ నుంచి గురువారం ఉ దయం జ్యోతి పీలేరు కు చేరుకున్నారు. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి వద్ద విషాదఛాయలు అలుముకున్నాయి. భూదేవి రెడ్డి, రవీందర్ రెడ్డి లు డబ్బు కోసమే తన బిడ్డను ఎత్తుకెళ్లి చంపి బొప్పాయితోటలో పడేశారని పీలేరు ప్రభుత్వ ఆస్పత్రి వద్ద బోరున విలపిస్తూ ఆరోపించారు. లేక లేక ఒక్కగానొక్క బిడ్డ కలిగాడని, అయితే అతన్ని కూడా దారుణంగా గొంతు నులిమి హత్య చేయడం ఏంటంటూ నిలదీశారు. ఇంత దారుణానికి పాల్పడ్డ నిందితులను కఠినంగా శిక్షించి, మాకు న్యాయం చేయాలంటూ విలపించారు. ఈనెల 12వ తేదీన చిత్తూరు జిల్లా, కె.వి పల్లి మండలం, చీనేపల్లె పంచాయతీ పరిధిలోని ఎగువ మేకలవారిపల్లిలో తేజోస్ రెడ్డి (8) అదృశ్యమయ్యాడు. తేజోష్ రెడ్డి మేనమామ వేణుగోపాల్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కె.వి పల్లి ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదు చేశారు. అదృశ్యమైన బాలుడు మేకలవారిపల్లికి సమీపంలోని బొప్పాయి తోటలో శవమై కనిపించాడు. మృతుడి మేనమామ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ముగ్గురు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కుమారుడి మరణవార్త తెలుసుకున్న జ్యోతి కువైట్ నుంచి గురువారం ఉదయం పీలేరు ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు చేరుకుంది.

## మాల కులస్తులకు వరస క్రమంలో ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ఎమ్మార్వో జయన్న కు వినతి



ఎమ్మిగనూరు అక్టోబరు 14,( విభారె) ఎమ్మిగనూరు పట్టణంలో నివసిస్తున్న మాలలకు 1998లో ప్రభుత్వం ఇచ్చిన పట్టాలు అప్పటి ప్రభుత్వం లో మొత్తం 496 పట్టాలు ప్రస్తుత ఉసేనప్ప కొట్టాల లో ఇచ్చారు అయితే అక్కడ మాలలకు 74 పట్టాలు మంజూరు చేసారు అయితే 496 పట్టాల లో మాలలకు అక్కడ అక్కడ ఇవ్వడం జరిగింది అప్పటి ఎమ్మెల్యే మాలలకు మాత్రమే సపరేటుగా ఒక వరుస క్రమంలో ఇవ్వమని ఎమ్మెల్యే మరియు ఎమ్మార్వో వారికి చెప్పారు. అప్పటి ఎమ్మార్వో మీ మాలలు అందరికి ఒక వరుస క్రమంలో ఇచ్చాకే మీ పట్టాలు మీ చేతికి ఇస్తామని చెప్పి వాపస్ తీసుకుని ఇప్పటికివరకు ఇవ్వలేదు సుమారు 17 సంవత్సరాలనుండి ఈ పోరాటం మాల మహానాడు తరుపున ఎమ్మెల్యే ఎమ్మార్వోకి మున్సిపల్ చైర్మన్ లకు కలెక్టర్ అందరికి వినతి పత్రం సమర్పించిన ఫలితం శున్యం కావున దీనిపై సమగ్ర విచారణ జరిపి న్యాయం చేయమని ఎమ్మార్వో గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు. అధ్యక్షులు ఉసేనప్ప. కార్యనివాహక అధ్యక్షులు మురళీకృష్ణ. ప్రధాన కార్యదర్శి రంగయ్య. వీరేష్. లక్ష్మన్న. ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు

## అసోసియేషన్ ఫర్ ఆర్ టి ఐ

### జిల్లా అధ్యక్షులు గా కె వి సుబ్బారావు

దర్శి అక్టోబరు 14,( విభారె) అసోసియేషన్ ఫర్ ఆర్ టి ఐ ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం 17వ ఆవిర్భావ దినోత్సవం మరియు నూతన కమిటీల నియామకం. విజయవాడ గాంధీ నగర్ లో గల శ్రీ రామ ఫంక్షన్స్ హాల్ నందు అసోసియేషన్ ఫర్ ఆర్ టి ఐ (రిజిస్ట్రేషన్ నెంబర్ 14/2019)ఆధ్వర్యంలో సమాచార హక్కు చట్టం -2005 " 17 వ ఆవిర్భావ దినోత్సవ " వేదిక మరియు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం లో ప్రకాశం జిల్లా నూతన కమిటీ నియామకం జరిగింది. ప్రకాశం జిల్లా నూతన అధ్యక్షులు గా కొత్త వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షులు గా ఒంగోలు వసంత్ కుమార్ , జాయింట్ సెక్రటరీ గా పానుగంటి వెంకట మోహన్ రావు, మరియు పలువురు ఎగ్జిక్యూటివ్ మెంబర్లను ఎన్నుకోవడం జరిగింది.



# అడుగేస్తే గుంత..ఆదమరిస్తే తంటా



### " పాడయిన రహదారులు- వాహనదారుల ఒళ్లు గుల్ల"

పత్తికొండ అక్టోబరు 14,( విభారె) వర్షాకాలంలో బురద మయంగా మారిన రహదారులు వర్షాకాలం పూర్తయ్యాకా పెద్ద పెద్ద గుంతలు, గతుకులతో దర్శనమిస్తున్నాయి. ఆ దారుల్లో ప్రయాణించేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పదే పదే ఆ దారుల్లో ప్రయాణించడం వల్ల ప్రయాణికుల ఒళ్లు గుల్లవుతోంది...వర్షాకాలం వచ్చిందంటే చాలు బురదతో నిండిపోతున్న రహదారులను అధికారుల పట్టించుకోకపోవడంతో వర్షాకాలం పూర్తయిన తరువాత మరింత అధ్వాన్నంగా తయారయ్యాయి. ఏడాది అధిక వర్షాల వల్ల సగానికి పత్తికొండ నుంచి గుత్తి పోయే రహదారులు మరియు పత్తికొండ నుంచి గుంతకల్ పోయే దారులు పైగా రోడ్లన్నీ రాళ్లు తేలడం, బురదమయంగా మారడంతో ఆయాదారుల గుండా ప్రయాణం చేసేందుకు వాహనదారులు, ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. తరచూ పాడయిన రోడ్లల్లో ప్రయాణించడం వల్ల వాహనదారులు వెన్ను, మెడ సంబంధ రోగాల భారిన పడుతున్నారు. పత్తికొండపట్టణంలో రహదారులకూ అదే దుస్థితి దాపురించింది. కొంత మేర రహదారులకు మరమ్మతులు చేస్తున్నా మిగిలిన దారులు ఇంకా గుంతలు, గతుకులతోనే దర్శనమిస్తున్నాయి. పత్తికొండలో , గుత్తి టర్నింగ్ దగ్గర అంబేద్కర్ సర్కిల్లో పెట్రోల్ బంక్, గుత్తి రోడ్డు ఎన్టీఆర్ విగ్రహం సర్కిల్ దగ్గర తదితర గ్రామాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. ప్రజలు తిరగాలంటే అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. గుంతలు ప్రమాదకరంగా దర్శనమిస్తున్నాయి. పత్తికొండ గుత్తి టర్నింగ్ లో ఏర్పడిన గుంత మరింత అధ్వాన్నంగా ఉన్నాయి. అక్కడక్కడా పెద్ద పెద్ద రాళ్లు వేశారు . వాహనాలు ఎదురుపడితే ఎదో ఒక వాహనం కొంత దూరం వెళితే గాని ఇంకో వాహనం ముందుకెళ్లని పరిస్థితి నెలకొంది. యాత్రికులు నిరంతరం ప్రయాణిస్తూ ఉంటారు. ఇలాంటి ప్రధాన రహదారిపై ఆర్ అండ్ బి అధికారులు దృష్టి సారించడం లేదు. రోడ్డు గుంతలుగా మారడం, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆ దారిలో ప్రజలు నిరంతరం ప్రయాణిస్తూ రాత్రివేళల్లో ప్రమాదాలకు గురవుతున్నారు.పట్టణం ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి...

### ఎన్ ఎస్ యు ఐ విష జ్వరాలతో ఇబ్బంది పడుతున్న , పలు గ్రామస్తులు



ఎమ్మిగనూరు అక్టోబరు 14,( విభారె) నియోజకవర్గంలోని పలు గ్రామాలలో విష జ్వరాలతో పిల్లలు, పెద్దలు అల్లాడుతున్నారు అని, ఎన్ ఎస్ యు ఐ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షులు గురువారం వీరేష్ యాదవ్ ఒక ప్రకటనలో మాట్లాడుతూ చాలామంది దూరప్రాంతలకు వెళ్లి ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు అని, వెంటనే పలు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఆరోగ్యశాఖ అధికారులను,ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు.

## గౌ. భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయ మూర్తి కి ఘన స్వాగతం

రేణిగుంట, అక్టోబరు 14,( విభారె),అక్టోబర్ 14: రెండు రోజుల తిరుపతి, తిరుమల పర్యటన నిమిత్తం విచ్చేసిన గౌ. భారత సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ జస్టిస్ ఎన్.వి. రమణ గారికి ఘన స్వాగతం లభించింది. రెండు రోజుల పర్యటన నిమిత్తం గురువారం మధ్యాహ్నం 2.10 గంటలకు రేణిగుంట విమానాశ్రయం నకు చేరుకున్న గౌ.భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గారికిఆంధ్ర ప్రదేశ్ హైకోర్టు గౌ.ప్రధాన న్యాయమూర్తి శ్రీ జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, గౌ.భారత సుప్రీంకోర్టు జడ్జి జస్టిస్ హిమ కోహిల్, భారత సుప్రీంకోర్టు సిపిఎస్ రిజిస్టర్ శ్రీ శ్రీధర్ రావు, గౌ. హైకోర్ట్ జడ్జిలు శ్రీ జస్టిస్ .ఎం. సత్యనారాయణ మూర్తి,జస్టిస్ లలిత కనికంటి, హైకోర్ట్ రిజిస్ట్రార్ జనరల్ కె.బానుమతి,హైకోర్ట్ రిజిస్ట్రార్ ఎ.గిరిధర్, చిత్తూరు జిల్లా జడ్జి వై వి ఎస్ డి జి.పార్థ సారథి,జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్, తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర రెడ్డి, తిరుపతి మూడవ అదనపు జిల్లా జడ్జి వై.వీర్రాజు, డి.ఐ.జి. క్రాంతి రతన్ టాటా, ఎస్.పీ లు చిత్తూరు , తిరుపతి(అర్బన్), సెంథిల్ కుమార్, వెంకట అప్పల నాయుడు, ఎ.ఎస్.పి సుప్రజ, ఆర్డీఓ తిరుపతి కనకనరసా రెడ్డి, ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సురేశ్, చిత్తూరు జిల్లా బార్ అసోసియేషన్ సభ్యులు ప్రెసిడెంట్ దినకర్, రేణిగుంట తహశీల్దార్ శివ ప్రసాద్, తదితరులు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.



## అక్టోబర్ 31 వరకు జిల్లాలో కర్ఫ్యూ పొడిగింపు

### అర్ధరాత్రి 12 గంటల నుంచి తెల్లవారు జామున 5 గంటల వరకు జిల్లాలో కర్ఫ్యూ అమలు
### సభలు, సమావేశాలు, వివాహాల వంటి శుభకార్యాలకు గరిష్టంగా 250 మంది వరకూ అనుమతి
### కోవిడ్ నిబంధనలు పాటించాలిజిల్లా కలెక్టర్ పి కోటేశ్వర రావు

కర్నూలు, అక్టోబరు 14,( విభారె) కోవిడ్ నియంత్రణ చర్యల్లో భాగంగా కర్ఫ్యూ ఆంక్షల్ని ఈ నెల 31 వరకు కొనసాగిస్తూ వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసిందని, ప్రతి రోజు రాత్రి 12 గంటల నుంచి తెల్లవారుజామున (ఉదయం) 5 గంటల వరకు జిల్లాలో కర్ఫ్యూ ఆంక్షలు అమల్లో ఉంటాయని జిల్లా కలెక్టర్ పి కోటేశ్వర రావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.కోవిడ్ నియంత్రణలో భాగంగా వివాహాలు, ఇతర శుభ కార్యాలు, మతపరమైన సమావేశాలు ఏదైనా సరే గరిష్టంగా 250 మందికి మాత్రమే అనుమతి ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, ఆ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో 250 మందికి మించి గుమికూడకుండ పోలీస్, రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని, అలాగే ప్రతి ఒక్కరూ కోవిడ్ నిబంధనలు విధిగా పాటించేలా చూడాలన్నారు. మాస్కులు ధరించడంతో పాటు భౌతిక దూరం పాటించాలని, శానిటైజ్ చేసుకునేలా చూడాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో కానీ ఫంక్షన్ హాళ్ళలో గాని ఫిక్స్ సీట్లు అయితే సీట్ మార్చి సీట్ లో కూర్చునేలా చూడాలన్నారు.వివాహాలు, ఇతర శుభకార్యాల్లో 250 మంది ప్రవేశానికి అనుమతి ఉందని, ఈమేరకు ప్రజలు కూడా సహకరించాలని, భౌతిక దూరం పాటిస్తూ, మాస్కులు తప్పనిసరిగా ధరించాలని జిల్లా కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## బొబ్బిలి రాజుల ఆయుధ పూజ

విజయనగరం అక్టోబరు 14,( విభారె)దసరా వచ్చిందంటే సామాన్యుని నుంచి రాజకుటుంబాల వరకు పండగ సందడే. ముఖ్యంగా సంప్రదాయానుసారం ఆయుధ పూజను నిర్వహిస్తుంటారు. రాజకుటుంబాల్లో ఆయుధ పూజకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారు. ఇక చారిత్రాత్మక బొబ్బిలి కోటలో అలనాటి ఆయుధాలకు రాజకుటుంబ వారసులు ప్రత్యేక పూజలు నిర్వహించి దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బొబ్బిలి రాజులైన మాజీ మంత్రి సుజయక్రుష్ణ రంగారావు, ఆయన సోదరులు బేబీనాయన, రామ్ నాయనలు సంప్రదాయబద్ధంగా ఆయుధాలకు ప్రత్యేక పూజలను కుటుంబ సమేతంగా నిర్వహించారు. ఈ వేడుకలను చూసేందుకు ప్రజలంతా తరలివచ్చారు. కోటలో జరిగే ఆయుధ పూజ సందర్భంగా బొబ్బిలి యుద్ధ కాలం నాటి ఆయుధాలను ప్రదర్శించి, వాటికి సంప్రదాయ పూజలు నిర్వహించారు. అదే విధంగా అప్పటి రాజ దర్బార్ సింహాసనాన్ని కూడా ఈ వేడుకలో ఉంచి పూజలు చేయడం విశేషం.

## దేవుళ్ళతో సమనమా మన ప్రజా ప్రతినిధులు... సిగ్గు సిగ్గు

అమరావతి అక్టోబరు 14,( విభారె) బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శిరిపురపు శ్రీధర్ శర్మ మాట్లాడుతూ చిలకలూరిపేట పట్టణంలోని పోలేరమ్మ గుడివద్ద దేవునితో సమానంగా అమ్మవారి రూపాల మధ్య స్థానిక ఎమ్మెల్యే విడుదల రజని ఇలా దణ్ణం పెడుతున్న ఫోటోలతో ఫ్లెక్సీలు పెట్టడం దేనికి సంకేతం, కావాలనే దేవతలను అవమానించటమే నని, మొన్న తిరుమలలో కొండ కింద నుంచి కొండ పై దాకా ముఖ్యమంత్రి ఫ్లెక్స్ లతో నింపేశారు. కేవలం 5ఏళ్ళు అధికారంలో ఉండే మన ప్రజా ప్రతినిధులు సిగ్గు పడంల్సిన విషయం. దేవుళ్ళతో పోటీ పడే స్థాయి కాదు మీది కాదు, ఇలా దేవుళ్లను అవమాణిస్తే అదే దేవుళ్ళు మీకు,మీ కురుంబాలకు సరైన సమయంలో తప్పక శిక్ష విధిస్తారని శ్రీధర్ హెచ్చరించారు. హిందు ధర్మాన్ని, సంస్కృతిని అవమణిస్తే స్థానిక ప్రజలతో తగిన గుణపాటం చెప్తామని, భక్తులతో ఎన్నికైన ప్రజా ప్రతినిధులు దేవుళ్లను,మత విస్వాసలను దెబ్బతీసే విధానాన్ని శ్రీధర్ తీవ్రంగా ఖండించారు.

---

# సామ్ బాలీవుడ్ ఎంట్రీకి అంతా సిద్ధం



సౌత్ స్టార్ హీరోయిన్ సమంత త్వరలో బాలీవుడ్ లో కూడా స్టార్ హీరోయిన్ గా మారబోతున్నట్లుగా తెలుస్తోంది. ఇప్పటికే సామ్ ది ఫ్యామిలీ మ్యాన్ 2 వెబ్ సిరీస్ ద్వారా హిందీలో మంచి గుర్తింపును దక్కించుకున్నాడు. వెబ్ సిరీస్ సక్సెస్ అవ్వడంతో పాటు ఆమెకు నటిగా మంచి గుర్తింపును తెచ్చి పెట్టింది. దాంతో ఈ అమ్మడికి బాలీవుడ్ లో వరుసగా ఆఫర్లు వస్తున్నాయి. సామ్ ఇటీవల ఒక బాలీవుడ్ మూవీకి ఓకే చెప్పినట్లుగా తెలుస్తోంది. కథ ఓకే అవ్వడంతో సామ్ నటించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఒక పెద్ద సినిమాతోనే సామ్ బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం సామ్ బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్న సినిమాకు సంబంధించిన ఏర్పాట్లు దాదాపుగా అన్ని పూర్తి అయ్యాయి.ఒక మంచి సమయం సందర్భం చూసి సినిమాకు సంబంధించిన విషయాలను అధికారికంగా వెల్లడించడం కోసం సామ్ వెయిట్ చేస్తుందట. బాలీవుడ్ ప్రాజెక్ట్ కోసమే సమంత ఈమధ్య కాలంలో తెలుగు లో కాని తమిళంలో కాని సినిమాలకు ఓకే చెప్పలేదు. బాలీవుడ్ లో ఇప్పటికే వెబ్ సిరీస్ తో సక్సెస్ ను దక్కించుకున్న సమంత త్వరలోనే సినిమా ద్వారా కూడా సక్సెస్ కొట్టి అక్కడ ఇతర హీరోయిన్స్ మాదిరిగా బిజీ అవ్వాలని ఆశ పడుతోంది. ఆమె ఖచ్చితంగా ఒక మంచి సినిమాతో ఎంట్రీ ఇవ్వడం ఖాయం అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు కూడా అంటున్నారు. సామ్ సినిమాల ఎంపిక విషయంలో గత కొన్నాళ్లుగా ఆచితూచి వ్యవహరిస్తుంది.సినిమాలు మరియు వెబ్ సిరీస్ లు అనే తేడా లేకుండా పాత్ర కు మంచి ప్రాముఖ్యత ఉంటే ఖచ్చితంగా చేసేందుకు ముందుకు వస్తోంది. చైతూ నుండి విడిపోయేందుకు నిర్ణయం తీసుకున్న తర్వాత సమంత తన పూర్తి దృష్టిని సినిమాలపై పెట్టబోతుంది. అందుకోసం హిందీ సినిమాలను ఎంపిక చేసుకోవాలని.. సౌత్ నుండి దూరంగా వెళ్లాలని ఆమె భావిస్తుందేమో అంటూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈమధ్య కాలంలో సౌత్ స్టార్స్ పలువురు బాలీవుడ్ బాట పడుతున్నారు. అందుకే సమంత కూడా ఒక మంచి ఇన్నింగ్స్ ను బాలీవుడ్ లో దక్కించుకోవాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఆమె మొదటి సినిమా కోసం ఎదురు చూస్తున్నామని అభిమానులు చెబుతున్నారు.

## అఖిల్ ఫోన్ వాల్ పేపర్ 10 ఏళ్లుగా అదే..!

కొన్ని జ్ఞాపకాలను ఎప్పటికి గుర్తుంచుకోవాలనుకుంటాం.. కొన్ని జ్ఞాపకాలను మాత్రం గుర్తుంచుకోవాలనుకున్నా మర్చిపోతాం. జ్ఞాపకాల్లో నిలిచే వ్యక్తులు కొద్ది మందే ఉంటారు. ఎప్పటికి మనసులో ఉండే వ్యక్తులు కొద్ది మంది ఉంటారు. అలా అక్కినేని అఖిల్ మనసులో ఉండే వ్యక్తి తాత ఏయన్నార్. లెజెండ్రీ ఏయన్నార్ అంటే సాదారణ సినీ ప్రేమికుల్లోనే అమితమైన భక్తి.. ఆరాధన.. అభిమానం ఇప్పటికి కూడా ఉన్నాయి. ఆయన ఇండస్ట్రీలో ఎన్నో అద్భుతమైన పాత్రలను చేశాడు.. ఆయన చేసిన పాత్రలు ఇప్పటికి కూడా కళ్ల ముందు కదలాడుతూనే ఉన్నాయి. అంతటి అద్భుతమైన పాత్రల్లో కనిపించిన ఏయన్నార్ కొన్ని లుక్స్ లో ఎవర్ గ్రీన్ గా అనిపిస్తూ ఉంటాడు. నెట్ లో ఆయన పేరు సెర్చ్ కొడితే కొన్ని ట్రెండ్ మార్క్ ఫొటోలు ఫోజ్ లు వస్తాయి. అలాంటి ఫొటోలు రాబోయే తరాలకు కూడా ఏయన్నార్ ను అభిమాన స్టార్ గా నిలుపుతాయి అనడంలో సందేహం లేదు. ఏయన్నార్ చనిపోయినా కూడా ఆయన గుర్తులు నెమరవేసుకుంటూనే ఉంటారు. అఖిల్ తన తాతను ప్రతి రోజు గుర్తు చేసుకుంటూ ఆయన జ్ఞాపకాల్లో ఉంటాడట.ఈ విషయాన్ని స్వయంగా ఆయన వెల్లడించాడు. అఖిల్ అక్కినేని నటించిన మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్ సినిమా దసరా కానుకగా విడుదలకు సిద్దం అయ్యింది. ఆ సినిమా ప్రమోషన్ లో మీడియాతో మాట్లాడుతూ అఖిల్ ఒక ఆసక్తికర విషయాన్ని షేర్ చేసుకున్నాడు. గత పది సంవత్సరాలుగా తాను ఫోన్ లు మార్చుతూ వచ్చినా కూడా తన ఫోన్ వాల్ పేపర్ మాత్రం మార్చలేదు అన్నాడు. తన తాత ఏయన్నార్ ఫొటోను ఫోన్ స్క్రీన్ సేవర్ గా పెట్టుకున్నాడు. అది కూడా ఒకే ఫొటోను ఇన్ని సంవత్సరాలుగా తన స్క్రీన్ సేవర్ గా పెట్టుకుంటూ వస్తున్నాడట. బ్లాక్ అండ్ వైట్ లో ఉండే ఆ ఫొటో లో ఏయన్నార్ చాలా కూల్ గా లైట్ స్మైల్ తో కోర్టు వేసుకుని ఉంటారు. చెస్ట్ వరకు మాత్రమే ఆ ఫొటోలో కనిపిస్తూ ఉంటాడు.ఆ ఫొటో గురించి అఖిల్ మాట్లాడుతూ ఇది తాత నటించిన ఏ సినిమాలో స్టిల్ కాదు. ఒక సారి ఆడిషన్స్ కోసం మేకప్ టెస్ట్ చేయాల్సి ఉండగా తీసిన ఫొటో ఇది. ఎందుకో నాకు ఫొటో చాలా నచ్చింది. అప్పటి నుండి కూడా నా వద్ద ఈ ఫొటో ఉంది. ఫోన్ వాడుతున్నప్పటి నుండి కూడా నా ఫోన్ కు ఈ ఫొటోను వాల్ పోస్టర్ గా వాడుతున్నట్లుగా అఖిల్ చెప్పుకొచ్చాడు. ఇక అఖిల్ మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్ తో మొదటి కమర్షియల్ అందుకుంటాడా అంటూ అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఒక విభిన్నమైన కమర్షియల్ పాయింట్ తో రూపొందిన ఈ సినిమా పై అంచనాలు అక్కినేని ఫ్యాన్స్ భారీగానే పెంచుకున్నారు.అఖిల్ గత మూడు సినిమా ల తరహాలో కాకుండా ఈ సినిమా కమర్షియల్ గా బిగ్ సక్సెస్ ను చవి చూడాలని అంతా ఆశిస్తున్నారు. దసరా కానుకగా రాబోతున్న ఈ సినిమాకు బొమ్మరిల్లు భాస్కర్ దర్శకత్వం వహించగా పూజా హెగ్డే హీరోయిన్ గా నటించిన విషయం తెల్సిందే. గీతా ఆర్ట్స్ లో బన్నీ వాసు ఈ సినిమాను నిర్మించాడు.

# ఏపీ థియేటర్లలో ఇకపై నాలుగు షోలు..!



కరోనా వైరస్ ప్రభావం వల్ల మూతబడిన థియేటర్స్ అన్నీ ఇప్పుడు తెరుచుకుంటున్నాయి. ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ రాష్ట్రాల్లో ఇప్పటికే సినిమా హాళ్లు ఓపెన్ అవడంతో కొత్త సినిమాల విడుదలలు ఊపందుకున్నాయి. అయితే తెలంగాణ లో 100 శాతం సీటింగ్ ఆక్యుపెన్సీ తో సినిమాకలు ప్రదర్శిస్తున్నా.. ఏపీలో మాత్రం ఇంకా 50 శాతం ఆక్యుపెన్సీతో సినిమాలు నడుస్తున్నాయి. అలానే కరోనా పరిస్థితుల నేపథ్యంలో విధించిన కర్ఫ్యూ వలన మూడు షోలకు మాత్రమే అనుమతి ఉంది. అయితే ఇప్పుడు టాలీవుడ్ నిర్మాతలకు థియేటర్ యాజమాన్యాలకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది.ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కర్ఫ్యూ నిబంధనలు సడలిస్తూ జీవో జారీ చేసింది. రేపు గురువారం (అక్టోబర్ 14) నుంచి అక్టోబర్ 31 వరకు అర్ధరాత్రి 12 గంటల నుంచి ఉదయం 5 గం. వరకు కర్ఫ్యూ విధిస్తున్నట్లు పేర్కొన్నారు. దీంతో సినిమా థియేటర్లలో నాలుగు షో లు ప్రదర్శించుకోడానికి అవకాశం లభించినట్లు అయింది. ఇప్పటి వరకు మూడు షో లు మాత్రమే నడుస్తుండగా.. రేపటి నుంచి సెకండ్ షో కు కూడా వీలు కలిగింది. ఇది దసరా సందర్భంగా రిలీజ్ అయ్యే సినిమాలకు లాభం చేకూర్చనుంది. రేపు 'మహా సముద్రం' విడుదల అవుతుండగా.. శుక్రవారం 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' 'పెళ్లి సందఆ' సినిమాలు వస్తున్నాయి. ఈ మూడు చిత్రాలు ఏపీ థియేటర్లలో ఎప్పటిలాగే న్నాలుగు షో లలో ప్రదర్శించబడతాయి.ఇకపోతే 100 శాతం థియేటర్ ఆక్యుపెన్సీ పై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. ఇటీవల విడుదలైన చిత్రాలన్నీ 50 శాతం ఆక్యుపెన్సీ.. మూడు షో లతో నడిచాయి. ఈ నేపథ్యంలో ఇటీవల టాలీవుడ్ పెద్దలు ఏపీ ప్రభుత్వంతో చర్చలు జరిపారు. వంద శాతం ఆక్యుపెన్సీతో పాటుగా టికెట్ రేట్ల పెంపు పై ఈ మీటింగ్ లో డిస్కష్ చేశారు. మరి దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి త్వరలోనే జీవో జారీ చేస్తుందేమో చూడాలి.

## న్యూజిలాండ్ సిరీస్‌కు కోచ్‌గా రాహుల్ ద్రవిడ్!



రవిశాస్త్రి తర్వాత టీమిండియా కోచ్ ఎవరు అవుతారనేది పెద్ద సమస్యగా మారిపోయింది. టి20 ప్రపంచకప్ అనంతరం రవిశాస్త్రి కోచ్ పదవి నుంచి తప్పుకోనున్న సంగతి తెలిసిందే. కాగా కోచ్ పదవిపై ఆయన ఆసక్తి చూపకపోవడంతో టీమిండియాకు కొత్త కోచ్ అనివార్యంగా మారింది. అయితే తాజా సమాచారం ప్రకారం టి20 ప్రపంచకప్ ముగిసిన అనంతరం ప్రారంభం కానున్న న్యూజిలాండ్ సిరీస్‌కు ద్రవిడ్‌ను టీమిండియా తాత్కాలిక కోచ్‌గా ఉండాలని బీసీసీఐ కోరినట్లు తెలుస్తోంది. ఇదే విషయమై ఒక బీసీసీఐ అధికారి ఇన్‌సైడ్ స్పోర్ట్స్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో స్పందించాడు. ''న్యూజిలాండ్‌తో సిరీస్‌కు టీమిండియా కోచ్‌గా పనిచేయాలంటూ ద్రవిడ్‌ను కోరిన మాట నిజమే. దక్షిణాఫ్రికా టూర్ వరకు కొత్త కోచ్‌ను ఎంపిక చేస్తామని.. అప్పటివరకు ఆ పదవిలో ఉండాలని ద్రవిడ్‌ను కోరాం. అందుకు ఆయన సముఖత వ్యక్తం చేశారు. అయితే న్యూజిలాండ్‌తో సిరీస్ వరకు ద్రవిడ్ కోచ్‌గా వ్యవహరిస్తున్న సమయంలోనే కొత్త కోచ్‌కు సంబంధించి ప్రాసెస్ జరుగుతూనే ఉంటుంది. టీమిండియా కోచ్‌గా పూర్తిస్థాయిలో బాధ్యతలు చేపట్టేందుకు ద్రవిడ్ ఇష్టపడకపోవడం వెనుక ఫ్యామిలీకి ఎక్కువ టైమ్ కేటాయించాలనుకోవడమే. టీమిండియాకు ఉండే బిజీ షెడ్యూల్ కారణంగా తాను కూడా పూర్తిగా టీమిండియాతో ఉండాలన్న షరతుపై ద్రవిడ్ ఇష్టపడడం లేదు '' అంటూ చెప్పుకొచ్చాడు. కాగా టీమిండియా కోచ్ పదవికి ద్రవిడ్‌తో పాటు పలువురి పేర్లు కూడా వినిపించాయి. ముఖ్యంగా అనిల్ కుంబ్లే టీమిండియా కోచ్ పదవిని మరోసారి చేపడతాడంటూ వార్తలు చక్కర్లు కొట్టాయి. దీని వెనుక బీసీసీఐ అధ్యక్షుడు సౌరవ్ గంగూలీ ప్రధాన పాత్ర పోషించినట్లు సమాచారం. అయితే కుంబ్లే కోచ్‌గా రావడంపై కోహ్లి సహా పలువురు అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఒక సమయంలో టీమిండియా విదేశీ కోచ్‌లు వస్తున్నారని.. టామ్ మూడీ, లాన్స్ క్లుసేనర్, రికీ పాంటింగ్ లాంటి వారు టీమిండియా కోచ్ పదవిపై ఆసక్తి చూపిస్తున్నారని సమాచారం. అయితే టీమిండియా ప్రతీ సీజన్‌లో కనీసం 50 మ్యాచ్‌లతో బిజీగా ఉండడంతో విదేశీ కోచ్‌లు అన్ని రోజులు తమ ఫ్యామిలీకి దూరంగా ఉండడం కష్టమని మరికొందరు అభిప్రాయం.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190